ప్రజాశక్తి | స్నేహ
ఆదివారం అనుబంధం
మార్చి 05, 2017

కథా నిలయం
ENTERED
శ్రీకాకుళం
KSR02B1573 C

పరీక్ష

అందరికీ...!





జగపతి బాబు

సుధీర్‌బాబు

అరవింద్‌స్వామి

విలన్ హీరోలు!

ఒకప్పుడు విలన్ అంటే.. చింపిరి జుట్టు, మొఖంపై నల్లటి మచ్చలు, చేతిలో నాటు ఆయుధాలు, కరుకైన చూపు-మాటతో భయపెట్టేవారు. ఇప్పుడు ఆ ట్రెండ్‌కి తెర పడింది. చిత్ర నిర్మాతలు నేటి ప్రతి నాయకులను పూర్తి భిన్నంగా చూపిస్తున్నారు. ఆర్మానీ సూట్ ధరించే విలనైనా, గుబురు గడ్డం విలనైనా... ఇప్పుడు రొమాంటిక్, సిక్స్ ప్యాక్ హీరోలకి ధీటుగా పోటీ ఇస్తున్నారు. ఈ ట్రెండ్ కాస్త అటు ఇటుగా సోనూ సూద్ నుంచే మొదలైనా అది టాలీవుడ్‌లో కొత్త ఒరవడిని సృష్టించింది. ఇప్పుడది తమిళ చిత్రసీమకి పాకేస్తోంది. టాలీవుడ్‌లో దాదాపు అందరు స్టార్ హీరోల చిత్రాల్లో విలన్‌గా నటించాడు సోనూ సూద్. బాలీవుడ్, టాలీవుడ్ తోపాటు పలు చిత్రసీమల్లో తనకి హ్యాండ్సమ్ విలన్‌గా మంచి క్రేజ్ వుంది. తెలుగు, తమిళ చిత్ర సీమల్లో రొమాంటిక్ హీరోలుగా పేరు తెచ్చుకున్న జగపతి బాబు, అరవింద్ స్వామి సెకండ్ ఇన్నింగ్స్‌లో కొత్త లుక్‌తో కట్టిపడేస్తున్నారు. 'లెజెండ్', 'ఖైదీ నెంబర్-150' చిత్రాల్లో స్టైలిష్ విలన్లుగా వీరి రీ యంట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఐదు పదుల వయసులో జగపతి బాబు 'లెజెండ్'లో ధీటైన విలన్‌గా నటిస్తే, 'ధృవ'లో స్మార్ట్ విలన్ అనిపించుకున్నాడు అరవింద్‌స్వామి. టాలీవుడ్ హీరోలు రానా, సుధీర్ బాబు కూడా ఇదే ట్రెండ్‌ని ఫాలో అవుతున్నారు. ఇప్పటికే 'బాహుబలి' సీక్వెల్‌లో రానా విలనీ స్టైల్ అందరినీ ఆకట్టుకుంటే, 'భాగీ' చిత్రంతో విలన్‌గా బాలీవుడ్‌లో అరంగేట్రం చేశాడు సుధీర్‌బాబు. 'జానీ గద్దర్, న్యూయార్క్ టైమ్స్'లో నెగిటివ్ రోల్‌తో అదరగొట్టిన నెయిల్ నితిన్ ముఖేష్ తమిళ చిత్రం 'కతిథి'తో హ్యాండ్సమ్ విలన్ అనిపించుకున్నాడు. టాలీవుడ్‌లో ఎన్.టి.ఆర్ కొత్త చిత్రానికి ప్రతి నాయకుడిగా నెయిల్ కనిపించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. మార్షల్ ఆర్ట్సలో ఆరితేరిన విద్యుత్ జమైవాల్ నెగటివ్ రోల్‌లో కనిపించిన 'ఫోర్స్', తమిళ చిత్రం 'తుపాకి' రెండింటిలో మంచి మార్కులే కొట్టేశాడు. మొత్తం మీద కొత్త తరం విలన్లు నటనలోనూ, శరీరాకృతిలోనూ హీరోలకి గట్టి పోటీనే ఇస్తున్నారన్నమాట.



నెయిల్ నితిన్



రానా



సోనూ సూద్

KSR02B151
ENTERED

స్పిన్ మాంత్రికురాలు

క్రీడా మైదానంలో ఎటువంటి క్లిష్ట పరిస్థితినైనా వ్యూహాత్మకంగా ఎదుర్కోవడంలో ఆమె దిట్ట. తను గ్రౌండ్‌లో ఉంటే ప్రత్యర్థులకు సింహస్వప్నమే. ఎందుకంటే ఆమె ఎడమచేతి బ్యాట్స్‌ఉమెనేగాక రైట్ ఆర్మ్ స్పిన్ బౌలర్ కూడా. మహిళా క్రికెట్ జట్టులో వున్న ఐదుగురు మెరికల్లాంటి క్రీడాకారులలో ఆమె ఒకరు. అటు బౌలర్‌గా, ఇటు బ్యాట్స్‌ఉమెన్‌గా ఆడుతూ అతి తక్కువ కాలంలోనే ఆల్‌రౌండర్‌గా గుర్తింపు పొందింది. తన అద్భుత ఆటతీరుతో వరల్డ్ కప్ ఫైనల్‌లో స్థానం దక్కించుకుంది. అమె ఎవరో కాదు క్రికెట్ క్రీడాకారిణి దీప్తి శర్మ.

దీప్తి భగవాన్ శర్మ ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్పూర్‌లో జన్మించింది. తండ్రి రైల్వే అధికారి. తల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని. వీరికి ఏడుగురు సంతానం కాగా అందులో ఐదుగురు అబ్బాయిలు. ఇద్దరు అమ్మాయిలు. అందరికంటే చిన్నది పందొమ్మిదేళ్ల దీప్తి శర్మ.

కెరీర్ ఇలా మొదలైంది....

తొమ్మిదేళ్ల దీప్తి ఓసారి తన అన్నయ్యతో కలిసి క్రికెట్ గ్రౌండ్‌కి వెళ్లింది. అన్నయ్య ఆట తీరుని తీక్షణంగా గమనిస్తున్న ఆమె కాలికి అనుకోకుండా బంతి తగిలింది. వెంటనే చేతిలోకి తీసుకుని గురి చూసి స్టంప్స్ పైకి విసిరింది. అంతే ఒక్కసారిగా స్టంప్స్ అన్నీ నేలపై పడిపోయాయి. ఆ సమయంలో పక్కనే అమ్మాయిలకు క్రికెట్ శిక్షణ ఇస్తున్న హేమలతా కళ (మహిళల సెలక్షన్ కమిటీ ఛైర్‌పర్సన్) దృష్టి దీప్తిపై పడింది. తనలోని ప్రతిభను గుర్తించిన ఆమె దీప్తి అన్నయ్యతో తనని కూడా క్రికెట్ శిక్షణకు తీసుకురమ్మని చెప్పింది. అలా క్రీడా జీవితంలోకి అడుగుపెట్టిన ఆమె స్కూల్ స్థాయి నుంచి నేడు అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఎదిగింది.



మొదటిసారిగా 2014, నవంబర్ 28న జరిగిన అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో తలపడింది. 2015, జులైలో బెంగుళూరులోని చినస్వామి స్టేడియంలో న్యూజిలాండ్‌తో తలపడిన వన్డే క్రికెట్ మ్యాచ్‌లో 44 పరుగులు సాధించింది. అంతేకాదు. తన వన్డే మ్యాచ్‌లో ఉత్తమ స్కోరుగా నమోదు చేసుకోవడమేగాక, న్యూజిలాండ్‌పై ప్రదర్శించిన ఆటతీరుకు మంచి గుర్తింపును సంపాదించుకుంది. ఐ.సి.సి డబ్లు.డబ్లు.టి–20 మ్యాచ్ మొదటిసారిగా 2016, జనవరిలో సిడ్నీలో ఆడింది. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో రాంచీలో జరిగిన మూడవ వన్డే క్రికెట్ మ్యాచ్‌లో 9.2 ఓవర్లలో ప్రత్యర్థికి కేవలం 20 పరుగులు మాత్రమే ఇచ్చి 6 వికెట్లను అవలీలగా పడగొట్టింది. ఈ విజయం రికార్డును నెలకొల్పడంతోబాటు భారత్‌ను ఫైనల్‌కు చేర్చింది. శ్రీలంకతో ఆడిన మూడు వన్డే సిరీస్‌ల్లో 3–0తో సిరీస్ కైవసం చేసుకోవడమేగాక 12 వికెట్లను తన ఖాతాలో జమ చేసుకుంది. గతేడాది స్వదేశంలోనే ఆడిన అండర్–19 వన్డే సిరీస్‌లో చత్తీస్‌గఢ్‌తో ఆడి 175 స్కోరు సాధించడమేగాక 5 వికెట్లను తన సొంతం చేసుకుంది. ఆ క్షణం తనకొక మధురఘట్టంగా ఉండిపోయింది. క్రీడామైదానంలో తన బౌలింగ్ ధాటికి ప్రత్యర్థి జట్టు ఎదుర్కోలేక నిస్సహాయంగా ఉండిపోయిన సందర్భాలెన్నో ఉన్నాయి.

ఆటలో దిట్ట

కష్టపడే మనస్తత్వమున్న దీప్తి ఎలాంటి క్లిష్ట పరిస్థితినైనా తనకనుకూలంగా మార్చుకోగలదు. అందుకే తనకు అమ్మాయిలా కాకుండా అబ్బాయిలా శిక్షణ ఇస్తున్నానంటారు కోచ్ బిపిన్ అవస్థి. ప్రతిరోజూ ఉదయాన్నే 3 గంటల వ్యాయామం అనంతరం ప్రాక్టీసు చేస్తుంది. అమెకు కుటుంబం నుంచి ఎంతో ప్రోత్సాహం ఉంది. మ్యాచ్‌ల కారణంగా రాయలేకపోయిన పదవ తరగతి పరీక్షలను ఇప్పుడు రాసి పూర్తి చేయబోతోంది. రైల్వేలో ఉద్యోగ అవకాశమొచ్చినా క్రికెట్‌పైనే దృష్టి పెట్టింది. ఉద్యోగం ఎప్పుడైనా వస్తుంది, కానీ ప్రాక్టీసు తప్పితే ఆటను ఆడలేమంటుంది దీప్తి.

చిన్న వయస్సులోనే క్రికెట్ మెలకువలను అర్థం చేసుకోవడంతోబాటు మెరుపు వేగంతో బంతిని విసరగల సామర్థ్యం సంపాదించుకుంది. సహజంగా స్పిన్నరు బౌలింగ్‌కే పరిమితమవుతుంటారు. కానీ స్పిన్ బౌలింగ్‌లోనే కాక బ్యాటింగ్‌లోనూ అద్భుతంగా రాణించగల అరుదైన వ్యక్తులలో దీప్తి ఒకరు. ఆమె బ్యాటింగ్, బౌలింగ్ చేస్తున్నప్పుడు స్టేడియం కేరింతలతో హోరెత్తాల్సిందే. ప్రత్యర్థి స్కోరును అడ్డుకోవడంలో ఆమెకు ఆమే సాటి. ప్రతి బంతిని ఆత్మవిశ్వాసంతో విసరడమే తనీ స్థాయికి ఎదగడానికి కారణమంటోంది దీప్తి. మైదానంలో ఉన్నంతసేపు అలుపెరగక జట్టు గెలుపే లక్ష్యంగా ఆడుతుంది. క్రికెటర్ సురేష్ రైనా స్ఫూర్తితో దూసుకెళ్తున్న ఈ యువక్రీడాకారిణికి అర్జిత్‌సింగ్ పాటలు వినడం, క్రికెట్ సామ్రాట్ పుస్తకం చదవడమంటే చాలా ఇష్టమట.

- కుమారి

ఇండెక్స్

స్ఫూర్తి..................3
'మడ' మనిషి

స్టార్........4
అనుకరణతో అవార్డు కొట్టింది

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం...........10
ఊయల ఊగాలా..

విశేషం...............11
గుహ గ్రామం

కవిత్వమ్...............14
ఒక గుప్పెడు రాత్రులు

పరీక్ష అందరికీ...!

అట్టమీది కథ...6

వాళ్లు...
సాధించారు...
12

తెలుసా....................15
అద్భుత ద్వీపాలు

కథ 16
దత్త పుత్రులు

వినూత్నం 20
బాలల పంచాయతీ

రుచి......................21
చింతకాయ రొయ్యలు

బాల నేస్తాలు.............23
బ్రేక్ వేసి కాపాడాడు

పద వికాసం.....
....24

సైన్స్ ఎక్స్‌ప్రెస్ బాగుంది

ఇరాకీ మహిళ జహాహమీద్ భవన నిర్మాణ కళలో ఉన్నత స్థాయికి ఎదిగి వినూత్న శైలిలో సృష్టించిన నూతన భవనాలు అబ్బుర పరిచాయి. స్కూలు పిల్లలకి అవగాహన కలిగేలా సైన్స్ అంశాలను ప్రదర్శిస్తున్న సైన్స్ ఎక్స్‌ప్రెస్ విద్యార్థులకు గొప్ప వరం. మొదటి సినిమా దేవదాసుతో టాలీవుడ్‌ని షేక్ చేసిన రామ్ పరిచయం బాగుంది. కోతితో కిసుక్కు చిత్రం బాగుంది. ఇది ఫొటో చిత్రాల పోటీకి అర్హమైంది. ట్రంప్‌తో ట్రిక్ ఫొటోలు అద్భుతం. తెలుసాలో ఎన్నో కొత్త విషయాలు గ్రహించాం.

టి. సత్యనారాయణ మూర్తి, విశాఖపట్నం

నిటారు అరణ్యం

అడవులు అడ్డంగా విస్తరించాయన్నట్టుగా చైనాలోని నాంజింగ్‌లో ప్రారంభమైన వర్టికల్ ఫారెస్ట్ చిత్రాలు ఆకట్టుకున్నాయి. 656 అడుగుల ఎత్తున్న భవనాల్లో 23 రకాలకి చెందిన వందలాది చెట్లను పెంచడం అబ్బురపరిచే విషయం. పందొమ్మిదేళ్లకే జావలిన్ త్రోలో జూనియర్స్, సీనియర్స్ రెండు విభాగాల్లో రికార్డు సాధించి ప్రపంచ స్థాయి

అథ్లెట్‌గా పేరు తెచ్చుకున్న నీరజ్‌కి హ్యాట్సాఫ్. అద్దంలో ప్రతిబింబంలా వుండే శిల్పాలని తీర్చి దిద్దగల అనీష్ శిల్ప కళ అభినందనీయం. వినువీధుల్లో విహంగాలని పోలిన విమానాలపై అట్టమీది కథ ఆకట్టుకుంది. ఒకరికి సాయం చేయడమే కష్టమౌతున్న నేటి పరిస్థితుల్లో మలాడ్ ప్రాంతానికి చెందిన దంపతులిద్దరూ కొందరు పిల్లల ఆకలి తీర్చడం, వృద్ధులకు తోడుగా నిలవడం గొప్ప పరిణామం. కార్బన్ ఉద్గారాల ప్రభావాన్ని తగ్గించే దిశగా అరవింద్ తలపెట్టిన యాత్ర మంచి ఫలితాలివ్వాలని కోరుకుంటున్నాం.

ఆకాంక్ష దీప్తి, అనంతపురం.

అమ్మ భాషే ముద్దు

కొత్త భాషలు ఎన్ని నేర్చుకున్నా అమ్మభాషని మరవకూడదు. అలాంటి మాతృ భాష గురించి మంచి విషయాలు తెలుసుకున్నాం. ఉన్నత చదువులు చదువుకున్న వారందరూ విదేశాలకి తరలి పోకుండా సొంత ప్రాంతానికీ ఉపయోగపడాలని చెప్పిన అంకురం కథ ఆకట్టుకుంది. ఐక్యూ లెవెల్స్ ఎక్కువగా వుంటే ఐన్‌స్టీన్‌తో పోలుస్తుంటారు. మరి చిన్న తనం నుండి ప్రతి చిన్న విషయాన్నీ గుర్తుంచుకోవడం గొప్ప విషయం. అయితే అదో జబ్బు అని తెలుసుకొని ఆశ్చర్యపోయాం. గవర్నర్‌తో తలపడడం అంటే అంత తేలికేం కాదు. పదవీ దుర్వినియోగానికి పాల్పడిన ఓ గవర్నర్‌ని చట్టానికి పట్టించిన మార్విన్‌కి హ్యాట్సాఫ్. వయసు కంటే నటనానుభవమే ముఖ్యమని రుజువుజేశారు మన తారలు. రంగు కాగితాల్ని చుట్టి శిల్పాలుగా మలచిన జపాన్ వాసుల కళ, లాటరీ కష్టాలు, తోట కోసం ఆకట్టుకున్నాయి. కిసుక్కు చిత్రం బాగుంది. నవ్వుల్ పువ్వుల్ నవ్వు తెప్పించాయి.

చిన్నారావు, ఒంగోలు.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

స్ఫూర్తి

'మడ' మనిషి

వ్యక్తిగత శక్తియుక్తుల్ని ఫణంగా పెట్టి శ్రమించిన వారెప్పుడూ విజయాలు సాధిస్తూనే ఉంటారు. వన్-మాన్-ఆర్మీగా నిలిచిపోతూనే ఉంటారు. ఈ కోవకు చెందినవాడే కల్లెన్ పక్కుడన్! ఒంటరిగా మడ అడవిని కాపాడాలన్న బృహత్ కార్యాన్ని నెత్తికెత్తుకుని ఊరుమ్మడి శత్రువుగా మారాడు. ఆ తర్వాత అదే ఊరి జనంతో జేజేలు పలికించుకోవడమే కాక... అనుకున్నది సాధించాడు.

కల్లెన్ పక్కుడన్ కేరళ వాసి! కేవలం పన్నెండవ తరగతి వరకు చదువుకున్న వ్యవసాయ కూలి! పేద దళిత కుటుంబంలో జీవించిన బడుగు జీవి! ఆర్థిక ఇబ్బందుల కారణంగా చిన్నతనంలోనే తల్లిదండ్రులకు చేదోడు, వాదోడుగా వుండేందుకు కూలి పనికెళ్ళిన కష్టజీవి! అయితేనేం! జీవితానికి ఓ ఉన్నత ఆశయం ఏర్పరచుకున్నాడు! లక్ష్య సాధనకు కృషి చేశాడు. ఆ దిశగా ఎదురైన అవరోధాలెన్నింటినో అధిగమించాడు. ఒకప్పుడు ఊరు ఊరంతటికి శత్రువుగా మారాడు. ఇప్పుడు ఆ ఊరే అతని గొప్పతనానికి జోహార్లు పలుకుతోంది.

దాదాపు రెండు దశాబ్దాల జీవితాన్ని మడ చెట్లు (మాంగ్రూవ్) పెంచి, పోషించి, రక్షించడంలోనే గడిపి పర్యావరణ పరిరక్షణకు గొప్పగా తోడ్పడ్డాడు. కేరళలో మడ చెట్ల పెంపకం ఎక్కువ. అక్కడ ఉన్న మడ అడవులు కేరళకు ఒక రక్షణ కవచంలా ఉంటాయి.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవలసిన ఆవశ్యకతను చిన్నతనంలోనే గ్రహించాడు కల్లెన్. 1970–80 దశకంలో కేరళలో నిర్మాణమవుతున్న సైలెంట్‌వాలీ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా ఉద్యమం పక్కుడన్‌లో పర్యావరణం పట్ల అవగాహన కలిగించింది. అప్పుడే నిర్ణయించుకున్నాడు. తన ప్రాంతంలో జరుగుతున్న మడ చెట్ల విధ్వంసాన్ని ఎలాగైనా అడ్డుకోవాలని. అదే అతను పర్యావరణ పరిరక్షకుడిగా ఎదగడానికి పునాది వేసింది. 1989లో సంభవించిన తుఫాను ఆ ప్రాంతాన్ని పూర్తిగా తుడిచి పెట్టింది. దీంతో నది ఒడ్డు కోతకు గురి కాకుండా కాపాడాలని, అందుకు మడ చెట్లను పెంచాలని నిర్ణయించుకున్నాడు. అప్పటికింకా రాష్ట్రంలోని మడ అడవులలో జరుగుతున్న చెట్ల విధ్వంసంపై పర్యావరణవేత్తలు దృష్టి పెట్టలేదు. కోస్టల్ రెగ్యులైజేషన్ జోన్ చట్టం ఇంకా అమలులోకి రాలేదు. కాని అనేక పర్యావరణ విపత్తుల నుంచి మడ అడవులు కేరళవాసులను కాపాడతాయని కల్లెన్ గుర్తించాడు. తన కుటుంబం తిండి గింజలు కూడా లేక పస్తులుంటున్న రోజుల్లో ఏదో ఒక పని చేసి వాళ్లకు తిండి పెట్టడం కల్లెన్‌కు అలవాటయ్యింది. ఇప్పుడు కూడా నది ఒడ్డున, సముద్ర తీరాలలో మడ మొక్కలను నాటి పెంచి పోషించాడు. ఆ ప్రాంతాలలో చిన్న మడ అడవులను ఏర్పాటు చేసి వాటిని పరిరక్షించడం మొదలెట్టాడు. ప్రతి రోజూ బురద నీటిలో నడుచుకుంటూ చిన్న పడవలో ప్రయాణించి అడవులను సంరక్షించేవాడు. ఒక ప్రత్యేక రకానికి చెందిన మడ చెట్లను నాటేవాడు. అతను చేస్తున్న ఈ పనిలో అనేకమంది శత్రువులను పోగు చేసుకున్నాడు. గ్రామస్తులు కూడా శత్రువులుగా మారారు. సాధారణంగా గ్రామస్తులు మడ చెట్లను నరికేసి, రోడ్లు, భవనాలు నిర్మించుకుంటుండేవారు. వాటికి అడ్డు తగులుతున్నాడనే కల్లెన్ వారికి ఒక శత్రువుగా మారాడు. రాత్రికి రాత్రి అతను నాటిన మొక్కల్ని తుంచి నదిలో పడేసేవారు. అతను పెంచిన చిన్న అడవులను ధ్వంసం చేసేవాళ్ళు. అయినా కల్లెన్ ఏ మాత్రం సడలకుండా కృత నిశ్చయంతో ముందుకు సాగాడు. తాను అనుకున్నది సాధించాలనే దృఢ సంకల్పం చేసుకున్నాడు. సమయం చిక్కినప్పుడల్లా గ్రామంలోని పిల్లలతో భేటీ వేశాడు. గంటల కొద్దీ వాళ్ళకి మొక్కల పెంపకం గురించి, దాని వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించాడు. మడ అడవులను ఎలా రక్షించుకోవాలో ఉద్బోధించాడు.

కేవలం రెండేళ్ళలో కల్లెన్ నాటిన 300 మొక్కలు బాగా పెరిగాయి. ఆ ప్రాంతంలో దాదాపు ఒక కిలోమీటర్ పొడవున దట్టమైన పచ్చటి అడవిగా మారింది. దీంతో రాష్ట్ర అటవీశాఖ కదిలి వచ్చింది. అతను చేసిన కృషిని తెలుసుకుంది. అన్ని విధాల కల్లెన్‌కు సహకారాన్ని అందించనారంభించింది. అతనితో కలిసి 'మడ' మొక్కల నర్సరీలను ప్రారంభించింది. మడ మొక్కల పెంపకంపై ప్రజలలో అవగాహన కలిగించే ఏర్పాట్లు చేసింది.

దీంతో కల్లెన్ కృషికి క్రమక్రమంగా ఆదరణ పెరిగింది. గ్రామస్తులు మడ చెట్ల విధ్వంసాన్ని ప్రతిఘటించడం మొదలెట్టారు. విధ్వంసానికి పాల్పడిన వారిపై కేసులు నమోదవుతున్నాయి. మడ చెట్ల సంరక్షణ పథకాలు ప్రారంభమయ్యాయి. తొలిసారిగా పాలకులు తమ వార్షిక ప్రణాళికలో మడ చెట్లకు ప్రాధాన్యత నిచ్చారు. కల్లెన్ కృషికి ఇన్నాళ్ళకు గుర్తింపు లభించింది. పర్యావరణ రంగంలో చేసిన కృషికిగాను ఆయనను అనేక అవార్డులు రివార్డులు వరించాయి. రాష్ట్ర అటవీ శాఖ వనమిత్ర అవార్డునిచ్చింది. హరిత వ్యక్తి అవార్డు, పి.వి.థాంపి పర్యావరణ అవార్డు, భూమిమిత్ర అవార్డు ఇలా ఎన్నింటినో కల్లెన్ సొంతం చేసుకున్నాడు. కన్నూరే విశ్వవిద్యాలయం అయనకు ఆచార్య పురస్కారాన్ని ప్రదానం చేసింది. కల్లెన్ పర్యావరణ ప్రాధాన్యత, మడ చెట్ల పెంపకంపై అనేక ప్రసంగాలు చేశాడు. ఒక చేయి తిరిగిన రచయిత సహకారంతో తన జీవిత చరిత్రను రాశారు. 'మాంగ్రోవ్ స్కూల్' పేరుతో ఒక పాఠశాలను ప్రారంభించాడు. మొక్కల పెంపకంపై యువతరానికి శిక్షణ ఇస్తున్నాడు. చివరకు కల్లెన్ పేరు భారత్‌లో మడ చెట్లకు పర్యాయపదంగా మారింది. అతని పేరు కందల్ పక్కుడన్ అయ్యింది. మడ చెట్లను స్థానికంగా కందల్ అని పిలుస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలు "కందల్ పక్కుడన్" నుంచి అనేక సలహాలు పొందేవారు. ఇంత సాధించిన కల్లెన్ తన 78వ ఏట 2015లో ప్రపంచం నుంచి భౌతికంగా వీడినా... మడ చెట్ల వృద్ధికి ఆయన చేసిన కృషి మాత్రం ఇప్పటికీ సజీవంగానే ఉంది. కేరళకు చెందిన పి.వి.అబ్దుల్లా మహమ్మద్ ...కల్లెన్ అడుగుజాడలలో నడుస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

- కె.ఎస్.ఎమ్

అనుకరణతో అవార్డు కొట్టింది

స్టార్

భావన అసలు పేరు కార్తీకా మీనన్. చిత్ర సీమలోకి వచ్చిన తర్వాత భావనగా మారింది.

చిన్నతనం నుంచే సినిమాలంటే మహా పిచ్చి. ఐదేళ్ల వయస్సులోనే తన అభిమాన కథానాయిక అమల నటనను అద్దం ముందు చేస్తూ అనుకరిస్తుండేది. అందుకే కాబోలు మొదటి సినిమాకే రెండు అవార్డులను సొంతం చేసుకుంది ఈ కేరళ కుట్టి భావన.

- కేరళలోని త్రిస్సూర్ జిల్లాలో పుట్టింది. తండ్రి అసిస్టెంట్ సినిమాటోగ్రాఫర్ జి.బాలచంద్రన్ మీనన్. తల్లి పుష్పా మీనన్, అన్నయ్య జయదేవ్ మీనన్.
- త్రిస్సూర్‌లోని చెంబుక్కవులో హోలీ ఫ్యామిలీ గర్ల్స్ హైస్కూల్‌లో చదివింది.
- అన్నయ్య జయదేవ్ తమిళ సినిమా 'పట్టినపాకం' దర్శకుడిగా చిత్రసీమకు పరిచయమయ్యాడు.
- చిన్నప్పటి నుంచే సినిమాలను ఇష్టపడే భావన ఐదేళ్ల వయస్సులో ఉన్నప్పుడే మలయాళ చిత్రం 'ఎంటె సూర్యపుత్రిక్కు' లోని అమల నటనను అద్దం ముందు చేస్తూ అనుకరిస్తుండేదట.



- ఇంటర్‌మీడియట్ చదువుతుండగానే సినిమా ఆఫర్లు రావడంతో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టక తప్పలేదు.
- తన పదహారవ యేట మలయాళ చిత్రం 'నమ్మల్' (2002)తో వెండితెరకు పరిచయమైంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించడమేగాక మలయాళంలో ఎన్నో ఆఫర్లు సంపాదించి పెట్టింది.
- అక్కడి నుంచి మలయాళ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో నటించనారంభించింది.
- 'ఒంటరి' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది.
- 'నమ్మల్‌లో ప్రదర్శించిన అద్భుత నటనకు కేరళ రాష్ట్ర ప్రభుత్వ అవార్డు (స్పెషల్ జ్యూరీ అవార్డు)ను, ఉత్తమ సహాయ నటిగా ఆసియా నెట్ అవార్డును అందుకుంది.
- 2010లో తను నటించిన తొలి కన్నడ చిత్రం 'జాకీ' బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించింది. దీనిని తెలుగు, మలయాళ భాషల్లోనూ అనువదించారు.
- శ్యాం ప్రసాద్ దర్శకత్వంలో తీసిన మలయాళ క్రైమ్ థ్రిల్లర్ 'ఇవిడే'లో ఒంటరి తల్లిగా విమర్శకుల ప్రశంసలను అందుకుంది.
- భావనను కాతీ, తాకీడు అని కూడా పిలుస్తుంటారు.
- తనకు కథ నచ్చితేనే నటించడానికి ఓకే చెబుతుందట.
- మాతృభాష మలయాళంతోబాటు ఇంగ్లీషు, హిందీ, తెలుగు, తమిళ భాషలనూ మాట్లాడుతుంది.
- కేరళ, సింగపూర్, గోవా తనకెంతో ఇష్టమైన ప్రదేశాలు.
- ఇప్పటి వరకు దాదాపు 70 చిత్రాలలో నటించింది.
- ప్రతిరోజూ యోగా, మంచి ఆహారం, ఎప్పుడూ సంతోషంగా ఉండటమే తన గ్లామర్ రహస్యమంటుంది.
- సహజంగా అమ్మాయిలు వయస్సు దాచిపెట్టుకునే ప్రయత్నం చేస్తుంటారు. కానీ భావన మాత్రం అడగగానే టక్కున చెప్పేస్తుంది.
- చదువు మధ్యలో ఆగినందుకు మొదట్లో బాధపడినా చిత్ర రంగంలో సక్సెస్ కావడంతో తృప్తిపడుతుందట.
- తనకు మ్యూజిక్ అంటే చాలా ఇష్టం. క్లాసికల్, వెస్ట్రన్, హిందుస్థాన్ మ్యూజిక్ క్యాసెట్లను బ్యాగ్ నిండా వేసుకుని ఎప్పుడూ తనతోనే ఉంచుకుంటుంది.
- తెలుగులో ఒంటరి (2008), ట్వంటీ ట్వంటీ (2008), మహాత్మా (2009), నిప్పు (2011), జాకీ (2011) చిత్రాలలో నటించింది.
- దక్షిణ భారతదేశంలో ప్రముఖ నటి కావాలన్నది ఆమె జీవిత లక్ష్యం.

నవ్వుల్ - పువ్వుల్

నిజాయితీ

చింటూ : అమ్మా! నాకు ఫుట్‌బాల్ దొరికింది.
తల్లి : నిజంగానే దొరికిందా??!
చింటూ : నిజంగానే దొరికిందమ్మా...కావాలంటే చూడు బాల్ పారేసుకున్నతను ఇంకా అక్కడే వెతుక్కుంటున్నాడు.

మందబుద్ధి

వెంగళప్ప ఓ ఇంటర్వ్యూకి వెళ్లాడు.
అధికారి : నువ్వెంత వరకు చదువుకున్నావ్??
వెంగళప్ప : పరీక్ష ముందు రోజు వరకు...

పళ్లు రాల్తాయ్

సుబ్బారావు : నీ పళ్లు ఎలా విరిగాయి??
అప్పారావు : నవ్వితే
సుబ్బారావు : నవ్వితే పళ్లు ఎలా విరిగాయి???
అప్పారావు : నేను నవ్వింది ఒక వస్తాదును చూసి.

ఫెయిల్యూర్

డాక్టర్: మీ కిడ్నీ ఫెయిలైంది..... వెంటనే ఆపరేషన్ చేయాలి.
వెంగళప్ప : అయ్యో!! నా కిడ్నీ ఫెయిలవ్వడం ఏంటి. అది ఏ పరీక్షలూ రాయలేదు సార్!!



ఒక్క మాత్ర

డాక్టర్ : తలనొప్పికి ఈ రెండు ట్యాబ్లెట్‌లు వేసుకోండి.
వెంగళప్ప : రెండెందుకు డాక్టర్ నాకుంది ఒక్క తలేగా.....

నాకు నచ్చిన చిత్రం

ఇల్లస్ట్రేటర్ : జుంగో లీ, కొరియా

సేకరణ : బాలు.పీ గుండల

కిసుక్కు

సుజాత : డాక్టర్! మా బకెట్‌కి కన్నం పడింది. కాస్త మరమ్మతు చేసిపెట్టరు....
డాక్టర్: నేనెవరో తెలుసా?? (కోపంగా)
సుశీల : ఎందుకు తెలీదు 'ప్లాస్టిక్' సర్జన్ కదా.........

అతితెలివి

తండ్రి : చింటు ఈ సారి ఆటల పోటీలో నీకు ఫస్ట్ రావాలి. బాగా ప్రాక్టీస్ చేయ్...
చింటు : సరే నాన్నా..... కానీ మీరూ ఒకటి గుర్తుంచుకోవాలి..
తండ్రి : ఏంటది???
చింటు : చదువు ఆటలు రాత్రి-పగలు లాంటివి ఒకటి ఉన్న చోట మరోటి వుండదు.

లెక్క

అప్పారావు : నా భార్య నన్ను లెక్కచేయడం లేదు!
వెంగళప్ప : తనకి లెక్కలు సరిగా రావేమో రా!!

ఫన్నీ



క్రాప్ అదిరిందా!



పరీక్ష అందరికీ..!

ఇది ఎండల కాలమే కాదు. పరీక్షల కాలం కూడా. పది, ఇంటర్ చదివే చిన్నారులకే కాదు. వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కూడా. ఒక్క మాటలో చెప్పాలంటే అందరికీ పరీక్షే! మరి అందరికంటే బాగా చదివేసి... మంచి పర్సంటేజీ కొట్టేయాలని ప్రతి ఒక్క పిల్ల/పిల్లవాడి తల్లిదండ్రులు ఆరాట పడిపోతుంటారు. మా స్కూలు/ట్యూషను విద్యార్థులకే స్టేట్ ర్యాంకులు రావాలని టీచర్లు (ముఖ్యంగా కార్పొరేట్) ఆందోళన పడుతుంటారు. ర్యాంకుల రేస్‌లో తాము ఎక్కడ వెనకబడిపోతామో అని పిల్లలు కంగారు పడిపోతుంటారు. ఇన్ని ఆరాటాలు, ఆందోళనల నేపథ్యంలో పరీక్షలు నడుస్తున్నాయి. మరి ఎలాంటి ఒత్తిడి లేకుండా పిల్లలను పరీక్షలకు ఎలా పంపాలి? చదువుకునేలా వారిని ఎలా ప్రోత్సహించాలి? ఇందులో గురువులు, తల్లిదండ్రులు, చిన్నారుల పాత్ర ఏంటనేదే ఈ వారం అట్టమీది కథ.

డా॥ కాకర్లమూడి విజయ్

ప్రపంచంతో పాటు మనిషీ, మనిషితో పాటు తాను కనిపెట్టిన విద్యా సమాజంతో పాటు నిత్యం మారుతూనే వున్నాయి. ప్రతి దశలో వస్తున్న మార్పులను చేర్చుకుంటూ ముందుకు సాగుతోంది విద్యా విధానం. దాంతో, ప్రస్తుతం ఉన్న విద్యకీ, కొన్ని శతాబ్దాల క్రితం విద్యకీ అసలు పొంతన లేకుండా పోయింది.

ఒకప్పుడు విద్య అంటే కేవలం అవసరమైన జ్ఞానాన్ని, విషయ పరిజ్ఞానాన్ని నేర్పడమే. అమ్మ చెప్పిందీ అదే, నాన్న నేర్పిందీ అదే. జీవితానికీ, జీవనానికీ పనికొచ్చే విద్య. మానవుని ఉనికి ఏర్పడిన చాలా కాలం వరకూ అదే విద్యా విధానం. తల్లిదండ్రుల నుండి నేర్చుకున్న దానికి తాను చుట్టూ చూసిన వాటి నుండి నేర్చుకున్న వాటిని జోడించి, మనిషి పెరిగాడు. క్రీస్తు పూర్వం 2000 సంవత్సరంలో మెసొపొటేమియాలో సుమేర్‌లో ఒక మహా గొప్ప మార్పు సంభవించింది. అదేమిటంటే మొట్టమొదటిసారి బడి మొదలయ్యింది! ఆ బడులలో రాత మాత్రమే నేర్పేవాళ్ళు. అయితే ఈ గొప్ప అవకాశాన్ని అందుకున్న వాళ్ళు మాత్రం అందరూ కాదు, 'కొంతమంది పెద్ద వాళ్ళు' మాత్రమే.

కాలక్రమేణా గ్రీకులు దాదాపు ప్రస్తుతం మనం చూస్తున్న స్కూళ్ళ వంటివి స్థాపించారు. అంటే, మతంతో నిమిత్తం లేకుండా కుటుంబ విద్యకు అనుబంధంగా వుండే విద్యను అందించడం మొదలయ్యింది. సమాజంలో సంపూర్ణంగా ఉపయోగపడటానికి యువకులకు గణితం, సంగీతం, శారీరక వ్యాయామం వంటివి నేర్పేవారు. గ్రీసులోనూ రోమ్‌లోనూ ఇటువంటి స్కూళ్ళు సమాజంలో హోదా వున్న వారికి మాత్రమే అందుబాటులో ఉండేవి. ఇక ఇప్పుడు ఎటు చూసినా స్కూళ్ళే. ఏదో రకమైన విద్యా సంస్థలే. వాటి నిండా కుప్పలు తెప్పలుగా విద్యార్థులే (అయినా స్కూళ్ళకు నోచుకోని పిల్లలు లెక్కకు మించి వున్నారు).

విద్య నేర్పడం అంటూ వుంటే మరి అది ఎంతవరకూ సఫలమయ్యిందో తెలుసుకోవడం కూడా ఉండాలిగా. అందుకే అయ్యవార్లు తాము చెప్పినది ఎంతవరకూ అర్థం అయ్యిందో అని చిన్న చిన్న పరీక్షలు పెట్టేవాళ్ళు. అప్పట్లో అవి సరదాగా, ఆటల్లాగా వుండటంతో పిల్లలు కూడా ఆనందంగా పరీక్షలలో పాల్గొనే వాళ్ళు. అలా మొత్తానికి ఆడుతూ పాడుతూ చదువు పూర్తయ్యేది. కానీ ఇప్పుడు పరిస్థితి అలా లేదు. చదువంతా కేవలం పరీక్షలే అంతిమ లక్ష్యంగా తయారయ్యింది. ఇది ఎవరూ కోరుకున్నదీ కాదు. ఎవరూ నిర్ణయించినదో తెలీదు. ఇంతింతై, వటుడింతై అన్నట్టు అలా అలా క్రమేపీ పెరిగి, ఇలా తయారయ్యింది. ఇప్పుడు పరీక్షలు లేని చదువంటే అసలు చదువే కాదనే స్థాయికి మనం 'ఎదిగి' పోయాం.



చెప్పిన చదువులో ఎంత వరకూ అర్థమయిందో తెలుసుకునేందుకు, దాని ఆధారంగా పైతరగతిలోకి వెళ్ళడానికి వీలు కల్పించేవి మాత్రమే పరీక్షలు, అదే వాటి అసలు ఉద్దేశం. పరీక్షల వల్ల మరో ఉపయోగం పోటీ తత్వం పెరగడం. తోటి వారిని చూసి తాము ఇంకా మెరుగు అవ్వడానికి పరీక్షలు పనికొస్తాయి. బలాలు, బలహీనతలు పరీక్షల వల్లే తెలిసే అవకాశం వుంది. తప్పులు సరిదిద్దుకోడానికి కూడా పరీక్షలే ఉపయోగ పడతాయి.



కానీ పరీక్షా విధానమే కాస్త ఇబ్బందిగా, పైన చెప్పుకున్న అంశాలకు అనుగుణంగా లేని విధంగా వుంది. ఒక నిర్ణీత సమయంలో, ప్రత్యేక పరిస్థితులలో, కొన్ని ప్రత్యేక ప్రశ్నలకు జవాబులు రాయడం ద్వారా మాత్రమే విద్యార్థి మేధను అంచనా వేయడం సరైన పరీక్షా విధానం కాదు. చాలా మందికి పరీక్ష వ్యవహారమంటేనే విపరీతమైన భయం, సంశయం. అటువంటి మానసిక పరిస్థితులలో పరీక్షను ఆషామాషీగా తీసుకోలేరు. ఎంతో బాగా తెలిసిన జవాబులైనా ఆ సమయంలో గుర్తుకు రాక, వచ్చినా కంగారులో సరిగ్గా రాయక ఫలితం ప్రతికూలించడం పరిపాటి. ఒక తప్పు మొదలైతే, ఆ కంగారు, ఆందోళన మరింత లొంగదీసుకుని, విద్యార్థిని మరింత బలహీనపరుస్తాయి. ఇక ఆపై చాలా తప్పులు, పొరపాట్లు దొర్లి మొత్తం పరీక్ష దెబ్బ తింటుంది. వీటికి తోడు తల్లిదండ్రుల ఆశల తాలూకు వత్తిడి, సహచర విద్యార్థుల వత్తిడి, గురువుల వత్తిడి...ఇన్నింటి ప్రభావం బాగా పని చేసి ఫలితాన్ని కూడా దెబ్బతీస్తుంది. ఆ విధంగా కుంగిపోయిన వారు మిగతా పరీక్షలు కూడా తప్పే అవకాశం వుంది.

ఇక్కడ గమనించవలసిన విషయం... విద్యార్థులు కంగారు, పరీక్షలంటే భయపడటం మానేస్తే సమస్తం బావుంటుంది అని కాదు. అటువంటి పరిస్థితి ఇటు విద్యాలయాలు, తల్లిదండ్రులు కల్పించాల్సి వుంటుంది. ముందు నుండే 'పరీక్ష బాగా రాయకపోతే' ....అంటూ బెదరగొడితే, ఆ బెదిరింపు ని పాజిటివ్‌గా తీసుకునే వాళ్ళు దాదాపు ఉండరనే విషయం తెలుసుకోవాలి. అలాగే పిల్లలు కూడా అసలు పరీక్షలే తప్పు అనే ఆలోచన నుండి బయటకి రావాలి. పరీక్షలు తాము సంవత్సరం పొడవునా నేర్చుకున్న అంశాలపైనే కానీ కొత్తవి కాదు అన్న విషయం గుర్తుంచుకోవాలి.

కానీ ఇప్పుడు ప్రతి విద్యార్థి జీవితంలో చదువుకన్నా పరీక్షలే ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇది

తల్లిదండ్రుల పాత్ర

ఎన్ని చెప్పుకున్నా పరీక్షలు కచ్చితంగా పిల్లలపై విపరీతమైన ఒత్తిడి కలిగిస్తాయి. అటువంటి సమయంలో తల్లిదండ్రులే వారికి సహకరించాలి, ఒత్తిడి తగ్గేందుకు తోడ్పడాలి.

అందరు తల్లిదండ్రులూ తమ పిల్లలకి చదువులో సహాయం చేసే స్థితిలో ఉండక పోవచ్చు. అప్పుడు సరైన సహాయం బయట వారి నుండి (ట్యూషన్) అందించవచ్చు.

ఏదోవిధంగా తల్లిదండ్రులు పరీక్షల సమయంలో పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి. పిల్లలకి అందుబాటులో వుండాలి. వాళ్ళ చదువుకి అనుకూలమైన ప్రశాంత వాతావరణం కల్పించాలి.

మరో రకమైన తోడ్పాటు ...తమ అలవాట్లను మార్చుకోవడం. పెద్దలకు టీవీ సీరియళ్ళు చూసే అలవాటుంటేనో, ఫోన్లో గంటల కొద్దీ బాతాఖానీ చేసే అలవాటుంటేనో వాటిని తగ్గించుకోవాలి. పిల్లలకి అది తప్పు అని చెప్పి మనం దాన్ని చేయకూడదు కదా. ఇంట్లో పార్టీలు, సమావేశాలూ వాయిదా వేయాలి. కుటుంబ కలహాలూ, సమస్యలూ పిల్లల ముందు పెట్టడం తగదు (మామూలు రోజుల్లో కూడా సుమా).

అప్పుడప్పుడూ చదువుకుంటున్న పిల్లలను కొంచెం సేపు మాటల్లో పెట్టాలి. ఆ మాటలు కూడా చెత్త కాకుండా, మరీ జ్ఞానోపదేశం వైపు వి కాకుండా వుండాలి. కాస్త ఆటవిడుపుకు పనికి రావాలి అంతే.

మరీ స్ట్రిక్ట్‌గా జైలర్ లాగా రూల్స్ పెడితే వాటిని పిల్లలు నిబంధనలుగా పరిగణిస్తారు. అప్పుడు వాటినుండి బయట పడటానికి ప్రయత్నిస్తారు. తద్వారా పక్క దారి పడతారు.

కోప్పడటం, తిట్టడం, అవమానించడం, అవహేళన చేయడం, తక్కువగా చేసి మాట్లాడటం, ఇతరులతో పోల్చి తక్కువ చేయడం, తప్పులనే ఎత్తి చూపడం, 'ఎందుకూ పనికిరావు' అంటూ దిగజార్చడం మానాలి. ఇవన్నీ పరీక్షల సమయంలోనే కాకుండా ఇంకెప్పుడూ చేయకపోవడం మంచిది. ఇవేవీ లేకుండా కూడా పిల్లలు మంచి దారిలో వుంటారు.

నిత్యం చదువు, పరీక్షలు, ఫలితాలు, ఇతరులతో పోలికలు వుంటే పిల్లలపై మరింత ఒత్తిడి పెరుగుతుంది, అసహనం మొదలౌతుంది. కాబట్టి అటువంటి ఒత్తిడి కలుగకుండా జాగ్రత్త పడాలి.

కొంతమంది అతిగా ప్రాముఖ్యత చూపిస్తారు. నిమిష నిమిషానికీ పళ్లరసాలూ, టిఫిన్లూ అంటూ తెగ హడావిడి చేస్తారు. దీనివల్ల పిల్లలకే ఇబ్బంది. అసలు చదువు కుంటుపడుతుంది.

ముందు తల్లిదండ్రులు నిబ్బరంగా వుంటే పిల్లలూ ధైర్యంగా వుంటారు. పెద్దలే ఆందోళన చెందితే పిల్లలు మరింత అలజడికి లోనౌతారు.



అవాంఛనీయమే అయినా వాస్తవం.

ప్రస్తుత సంవత్సరానికి పరీక్షల పండగ సందడి మొదలయ్యింది. పరీక్షలు రాసే పిల్లల కంటే వాళ్ళ తల్లిదండ్రులకే మరింత కంగారూ, అలజడీ వుంటుంది. అటువంటి అర్థం పర్థం లేని కంగారు, అత్యుత్సాహం వల్లనే పిల్లలకు పరీక్షల్లో ఇబ్బంది కలుగుతుంది అని గ్రహించే వాళ్ళు చాలా తక్కువ.

అందరు పిల్లలూ ఒకేలా వుండరు. అందరి పిల్లల మేధా ఒకేలా వుండదు. వారి గ్రహణ శక్తీ, జ్ఞాపక శక్తి కూడా ఒకేలా వుండదు. అయితే వాటిని మెరుగు పరచుకోవడం సాధనతో వస్తుంది. అంతేగానీ పరీక్షల ముందు ఫలానా లేహ్యం అనో మరొకటో మందులు వాడి జ్ఞాపక శక్తులను పెంచుకోవడం జరగని పని. వాటికి దూరంగా వుండాలి. కొంతమంది తల్లిదండ్రులు కూడా పేపర్ లీక్ చేయించడానికో, ఎక్కడైనా అటువంటిది దొరుకుతుందనో తెగ ఆరాట పడుతుంటారు. ఇటువంటి పక్కదారులు పిల్లలకు పెద్దగా మంచి చేయవు. ఇంకొంతమంది పెద్దలు 'ఫలానా వాళ్ళ పిల్లలు రోజుకు పదిహేను గంటలు చదువుతారనో, అసలు రాత్రుళ్ళు నిద్ర మాని మరీ చదివేస్తున్నారు అనో తమ పిల్లలకు చెప్పి వారిలో పట్టుదలను పెంచుతున్నామని భ్రమిస్తూ వుంటారు. అటువంటి పోలికలు ఎక్కువ శాతం హాని చేస్తాయని మానసిక నిపుణులు అంటున్నారు. అవి విన్న పిల్లలలో ఆత్మన్యూనతా భావం అల్లుకుంటుంది, విశ్వాసం సన్నగిల్లుతుంది. నిజంగా బాగా చదివే వాళ్ళైనా ఇటువంటి మాటలకు నిరుత్సాహపడతారు. బహుపరాక్.

• • •

గురువుల జాగ్రత్తలు

పరీక్షలకు వెళ్ళే పిల్లల ఒత్తిడిని తగ్గించడంలో ఉపాధ్యాయుల పాత్ర కూడా చాలా ముఖ్యమైనది. పిల్లలు రోజులో చాలా ఎక్కువ సేపు టీచర్ల దగ్గరే వుంటారు. కాబట్టి, వాళ్ళు చెప్పిందే పిల్లలకు వేదం (తల్లిదండ్రుల కంటే కూడా). అందుచేత టీచర్లు తమ హోదాకు తగ్గట్టుగా పిల్లలను పరీక్షలకి సిద్ధపరచడం చాలా కీలకమైనది.

- ❑ పరీక్షలు అసలు ఏ విధంగా రాస్తే మంచి మార్కులు వస్తాయో వివరించాలి.
- ❑ వార్షిక పరీక్షలు మామూలుగా తరగతుల్లో జరిగే పరీక్షల్లాంటివే అనేలా విశ్వాసం కలిగించాలి.
- ❑ అసలు పరీక్షలు అంటే భయం లేకుండా ఉత్సాహపరచాలి.
- ❑ సందేహాలు ఉన్న అంశాలు, కఠినం అనుకున్న అంశాలని విడమర్చి వివరించాలి.
- ❑ మీకు మేము తోడు ఉన్నాము అనేలా భరోసా ఇవ్వాలి. టీచర్లే తమ వెంట వున్నారంటే పిల్లలకు ఒత్తిడి తగ్గుతుంది.

• • •

చిన్నారులకు...

పరీక్షలే సర్వసం కాదు, కానీ పరీక్షలు సర్వత్రా వున్నాయి. మీరు ఏమిటో నిరూపించుకునే అవకాశం పరీక్షలు. కాబట్టి మీకున్నదంతా వెచ్చించి మరీ పరీక్షలకు సిద్ధం అవ్వాలి, వాటి అంతు చూడాలి.

మీరేమీ శారీరక కష్టం చేయడం లేదు. బరువులు మోయడం, బావులు తవ్వడం కాదు ....హాయిగా కూర్చుని చదవడమే. చదివింది



చెక్ పాయింట్

- పరీక్షకి అవసరమైన పెన్నులు, రబ్బర్లు, పెన్సిళ్ళు పని చేస్తున్నాయా లేదా అని చెక్ చేసి మరీ సిద్ధంగా ఉంచాలి. హాల్ టికెట్ మరింత జాగ్రత్తగా వుంచి ప్రతి రోజూ తీసుకెళ్లేలా చేయాలి. అది మర్చిపోతే పరీక్ష హాల్ దగ్గర అనవసరంగా ఆందోళన చెంది ఇబ్బంది పడవలసి వస్తుంది.
- పరీక్షకి చాలా ముందే (కాస్త ముందు కాదు) వెళ్ళేలా చూడాలి. అక్కడ కొంత సమయం వుండటం వలన కాస్త ఒత్తిడి తగ్గుతుంది. ఏవైనా మర్చిపోతే వాటిని తెచ్చుకునే వీలు వుంటుంది.

అతి సమీక్ష అనర్థం

- ఒక పరీక్ష అయ్యాక రాసిన పేపర్ గురించి విపరీతంగా చర్చించనవసరం లేదు. అందులో ఏవైనా చిన్న పొరపాట్లు జరిగితే, వాటిని పెద్దగా చర్చిస్తే తరువాత పరీక్షపై దుష్ప్రభావం ఉండొచ్చు. పిల్లల్ని ఉత్సాహ పర్చాలిగానీ ఆందోళనకి గురి చేయకూడదు.

నిజాయితీగా...

టీచర్లు ముఖ్యమైన ప్రశ్నలు, పరీక్షకు వస్తాయి అనుకున్న ప్రశ్నలు నిజాయితీగా పిల్లలకు చెప్పాలి. పైగా, కేవలం ఇవి మాత్రమే చదవండి అనకుండా...ఇతర ప్రశ్నలకూ సిద్ధంకండి అని చెప్పాలి.



ఆహారం ఇలా...

ఆరోగ్యకరమైన ఆహారం సమకూర్చాలి. అడిగారు కదా అని అతిగా తిండి పెట్టకూడదు. పోషక పదార్థాలూ, రుచికరమైనవీ వుంటే ఆరోగ్యం గా ఉండవచ్చు. జంక్ ఫుడ్ అనారోగ్య కారణం కావచ్చు...ఫలితంగా పరీక్షలకు ఇబ్బంది కలగవచ్చు. అలాగే పరీక్షకు వెళ్లి రావడంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండ దెబ్బ తగలకుండా చూడాలి. బయటి ఆహారం, నీరు తీసుకోకుండా జాగ్రత్త పడాలి. కూల్‌డ్రింకులు, ఐస్‌క్రీంలు, రోడ్ల మీది పండ్ల రసాలు, చాట్‌లు వంటి ఆహార పానీయాల జోలికి కూడా పోకూడదు.



రిలాక్స్

నిత్యం పుస్తకం ముందు పెట్టుకుని కూర్చుంటే మాత్రమే చదువుతున్నట్టు కాదు. ఎంత గొప్ప మేధావులైనా ఆ విధంగా గంటల కొద్దీ చదవలేరు (కనీసం పరీక్షలకు తయారవ్వలేరు). కాబట్టి పిల్లలకి కాస్త స్వేచ్ఛను ఇచ్చి రిలాక్స్ అవ్వనివ్వాలి. రిలాక్స్ అంటే మరీ టీవీలు చూడటం, ఫోన్‌లో మాట్లాడటం కాదు గానీ, చదువు పైనుండి దృష్టి మరల్చడం. దాని వల్ల మరింత మెరుగ్గా చదువు కొనసాగించవచ్చు.

గుర్తుండేలా, గుర్తున్నది చక్కగా రాసేలా చదవడమే. నిజంగా మనసు పెట్టి చదివితే రెండు మూడు సార్లు చదివినా బాగా గుర్తుండి పోతుంది, బట్టీ పట్టనక్కర లేదు.

మరీ కష్టం అనిపించిన అంశాలను ముందు చూసి రాయండి, అప్పుడు ఇంకా బాగా గుర్తుంటాయి. అర్థం కాకపోయినా, తికమక అనిపించినా ఇతరుల సహాయం తీసుకోండి. అంతేగానీ ఒకే అంశం పై చాలా ఎక్కువ సమయం గడపవద్దు.

చదివేటప్పుడు ప్రశాంతంగా చదవాలి. పక్క గదిలో చప్పుడు, టీవీ సౌండు, ఫోన్ రింగు అనవసరం. ధ్యాస చదివే అంశంపై పెడితే ఇట్టె గుర్తు పెట్టుకుని త్వరగా చదువుకోవచ్చు.

మంచి ఆహారం టైం ప్రకారం తీసుకోవాలి. పిచ్చి పిచ్చి చిరు తిండ్లు తినకూడదు.

ఈ పరీక్షలన్నాళ్ళూ చదువు తప్ప మరొక విషయం మనకి అనవసరం అనుకోండి.

గంటల కొద్దీ పుస్తకాల ముందే కూర్చోవడం కంటే అప్పుడప్పుడూ కాస్త లేచి అటూ ఇటూ తిరిగి, తాజా గాలి పీల్చుకోవడం మంచిది. అది మెదడుని చురుకుగా ఉంచుతుంది.

చదువు ప్రణాళిక వేసుకోండి. ఏ రోజు ఏది చదవాలి, ఎంత సేపు చదవాలి అని నిర్ణయించు కొండి.

స్నేహితులు 'అది చదివావా, ఇది ఇంపార్టెంటు, పేపర్ లీక్ అయ్యింది, ఇవి గెస్స్ ప్రశ్నలు' అంటూ విసిగించే అవకాశం వుంది (మీరూ అలా ఇతరులని విసిగించకూడదు) కానీ అవి అస్సలు వినకండి. మీ టీచర్లు చెప్పినది, టెక్స్ట్ బుక్‌లో ఉన్నదీ చదివితే చాలు. ఎవరో ఏదో ఊహించి పది చెబితే ఒకటి రావచ్చేమో (అసలు రాక పోవచ్చు కూడా) గానీ ఫలానా ప్రశ్నలు వస్తా యని కచ్చితంగా ఎవరికీ తెలిసే అవకాశం లేదు.

మిమ్మల్ని మీరే ఉత్సాహపరచుకోండి. ఇవి కేవలం పరీక్షలు, వాటి అంతు చూడాలి అనుకోవాలిగానీ, 'ఇవి కేవలం పరీక్షలు. వాటితో నాకేంటి' అనుకోకూడదు.

సమయం ప్రకారం నిద్రపోండి. తెల్లవారి లేచి చదివితేనే బాగా జ్ఞాపకం వుంటుంది అనేది అందరికీ కాదు. మనసు పెట్టి చదివితే ఎప్పుడైనా బాగా చదువు మెదడులోకి ఎక్కుతుంది.

పరీక్షకి అవసరమైన సరంజామా అంతా సరి చూసుకోండి, ప్రతి రోజూ. హాల్ టికెట్ వంటి ముఖ్యమైనవి మరింత జాగ్రత్తగా పెట్టుకోండి.

కాపీ కొట్టడం వంటి పనులు చేతగాని వారికి, చదివే వారికి కాదు. అయినా అటువంటివి ఇబ్బందిని కలిగిస్తాయిగానీ మంచి ఫలితాలని కాదు. వాటిని నమ్మవద్దు. చదవని వారికి భయం. చదివిన వారికి విశ్వాసం. అదే వారి బలం.

పరీక్షల టైంలో పుకార్లు కూడా ఎక్కువ. 'పేపర్ లీక్ అయింది అనో, ఫలానా ప్రశ్నలు గ్యారంటీ అనో .... ప్రచారాలు జరిగినా నమ్మకండి. మీరు చదువుకున్న వాటిని చక్కగా రాయండి.

పరీక్ష హాల్‌కి ముందుగా చేరుకోండి. టైం దాటి వెళ్తే లోపలి వెళ్ళనివ్వరు. పరీక్షకి ప్రశాంతంగా వెళ్ళండి, ధైర్యంగా రాయండి, ఆనందంగా రండి. తల్లిదండ్రులూ, గురువులూ, పిల్లలూ గుర్తు పెట్టుకోవలసిన మరో విషయం: పరీక్షలే జీవితం కాదు – అవి జీవితంలో ఒక చిన్న భాగం మాత్రమే. కాబట్టి కేవలం పరీక్షలను కారణంగా చూపెట్టి ఈ ముగ్గురూ తమ తమ జీవితాలను అర్థరహితం చేసుకోకూడదు.

వింత లోకం

మాస్క్ వేస్తే..

సూపర్ హీరోలు.. కామిక్ హీరోల సినిమాలు చూస్తే మనమూ వాళ్లలా ఓ మాస్క్ తగిలించేసుకుని గూండాల్ని, రౌడీల్ని, చెడ్డోళ్లని ఇలా నేరగాళ్లందర్నీ ఓ పట్టు పట్టి బుద్ధి చెప్పాలని అనిపిస్తుంది. నిజంగా ఎవరు చేస్తారు చెప్పండి అని అనేయకండని బ్లాక్ విడో ముందుకొస్తాడు. హాంప్టన్ రోడ్లపై ఓ సూపర్ హీరో వేషం వేసుకుని రాత్రుళ్లు గస్తీ కాస్తుంటాడు ఈ కుర్రాడు. ఎవరైనా ఏ అమ్మాయి వెంట పడుతున్నా, మద్యం మత్తులో కొట్టుకుంటున్నా, దొంగతనాలు, దోపిడీలకు ప్రయత్నిస్తున్నా వారిని అడ్డగించే యత్నం చేస్తుంటాడు. పోలీసులకు సమాచారం చేరవేస్తుంటాడు. అసలు పేరు చెప్పకుండా 'మస్తుడా యూమా' అని చెప్పుకునే ఇతగాడు ఇలా రెండేళ్ల నుంచి ప్రతి రాత్రి వీధుల్లో ఎవరి కంటా పడకుండా తిరుగుతున్నాడు. పోలీసులకు మాత్రం ముఖం చూపిస్తాడు లెండి. మాస్క్ వేసుకుని తిరగ్గూడదని రూల్ ఉందక్కడ. కామిక్ పుస్తకాలు, సినిమాలు చూసి ఇలా మారలేదట. చిన్నప్పుడు కాస్త నిదానంగా ఉండేవాడని తోటి విద్యార్థులు, పిల్లలు వేధించేవారని... ఎలాగైనా వాటి నుంచి తప్పించుకోడానికి మాస్క్ వెనుక ముఖం దాచుకోవడం అలవాటైందన్నది అసలు విషయం. యూమా ఇప్పటివరకైతే పెద్దగా ఛేదించిన, ఆపిన కేసులేమీ లేవు గానీ ఒకసారి మనోణ్నే పోలీసులు కాపాడారు. మద్యం మత్తులో భార్యను చితకబాదుతున్న ఓ భర్తని అడ్డుకోబోతే...అతడు డొక్కల్లో గట్టిగా గుద్దడంతో గతుక్కుమన్నాడు యూమా. ఇంతలోనే గస్తీ తిరగాడినికి వచ్చిన పోలీసులు వాళ్లని చూసి మరో దెబ్బ పడేలోపు అడ్డుకున్నారు. లేకుంటే ఏం జరిగి వుండేదో. ఎందుకీ తిప్పలు మరోలా సేవ చేయొచ్చుగా అనుకోవచ్చు. పగటిపూట అదీ చేస్తాడట. యాక్సిడెంట్ జరిగిన ప్రదేశాలకు వెళ్లి ప్రథమ చికిత్స చేయడం, వృద్ధులకు సాయపడటం ఇలా. మనోడికి కరాటే, కుంగ్ ఫూ విద్యల్లో మాంచి ప్రవేశం ఉందని చెబుతాడు కానీ మాటలతోనే సమస్య పరిష్కరించేందుకు చూస్తాడట.

రాతి 'మనిషి'



అబ్రహం పాయించెవల్ అనే ఫ్రెంచాయనకు అన్నీ వింత ఆలోచనలే వస్తుంటాయ్. మరేంటండి రాతిలో తాను పట్టేంత సందు చేసుకుని 8 రోజులు నక్కి బతికితే ఎలా ఉంటుందా అని ఆలోచన చేస్తున్నాడు. ఇంతకీ ఇదంతా ఎందుకంటే, కాలం గడుస్తున్నా కదలకుండా లోన పడుండే రాయి ముక్కకు ఎలా ఉంటుందా' అనే విషయం తెలుసుకోవడానికట. ఇదేం తిక్కరా బాబూ అన్న మాటలు చెవిన పడ్డాయేమో ప్రపంచమంటే ఏంటనే తత్వ పాఠాన్ని నేర్చేసుకుంటానని సీరియస్‌గా చెబుతున్నాడు. 45 ఏళ్ల అబ్రహం సాహస ప్రదర్శనల కళాకారుడు. చాలామందికి ఇరుకైన చోట్లంటే భయం... మరి ఇక కదలడానికి మెదలడానికి అవకాశం లేనంత బిగుతైన రాతిలో ఓ నిమిషం ఉన్నా 'కాపాడండి' అని అనేస్తారట. మరి 8 రోజులుంటే సాహసమేగా. గాలి పీల్చుకోడానికి ఓ వెంటిలేషన్ డక్ట్ మాత్రమే ఉంటుంది. తల నుంచి కాలి వేళ్ల వరకు అంతా ఓ పెద్ద రాతిలోనే. అడ్డంగా కోసిన పెద్ద రాయిలో కూర్చున్న భంగిమలో రాతిని తొలచి మనోణ్ని ఉంచి రెండు ముక్కల్ని జత చేసి మూసేస్తారు. నీరు, ఆహారం చిన్న చిన్న ప్యాకెట్లు చేతుల దగ్గర ఉంచుతారు. పారిస్‌లోని ఓ ప్రదర్శన శాలలో ఏర్పాటు చేసిన ఈ స్టంట్‌ను చూసేందుకు అబ్రహం పరిస్థితి తెలుసుకునేందుకు చిన్న చిన్న కెమెరాల్ని రాయిలోనే ఉంచారు. ఎప్పటికప్పుడు వైద్య బృందం అతడి క్షేమం తెలుసుకుంటుంటుంది రాతిని కదపకుండా. ఏదైనా అత్యవసరమైతే వెంటనే రాతి ముక్కలు విడిపోయేలా ఏర్పాటు ఉంది లెండి. తాను ఈ ప్రపంచంలోనే ఉన్నాననే విషయాన్ని గుర్తు చేస్తుండేలా అప్పుడప్పుడూ తనతో మాట్లాడాలని సందర్శకుల్ని కోరాడట. అయినా ప్రపంచంలో ఇంకెవరికైనా ఇలాంటి తిక్క ఆలోచన వస్తుందా. డౌటే!

ఊయల ఊగాలా..

ఉయ్యాళ్ల దేశం ఎస్తోనియా. ఇంటింటికీ... వీధివీధికీ... సందు సందుకీ రకరకాల ఊయలలుంటాయా దేశంలో. చిన్నోళ్ల నుంచి పెద్దోళ్ల వరకు ఊయలలూగడం సరదానే కాదు వారి సంప్రదాయాల్లో సైతం వాటికి పెద్ద పీటే వేశారు. సంప్రదాయాలేనా ఆటల పోటీలు.. సాహస ఫీట్లు ఇంకా ఇంకా ఊయల తాడంత జాబితా ఉంది. దీంట్లో ఇప్పుడు మరో క్రీడ తెగ ఊగేస్తోంది... డేర్‌డెవిల్స్‌నూ ఊపేస్తోంది. అదేంటంటే ఊయల్ని 360 డిగ్రీల కోణంలో ఊగేయడం. గ్రావిటీని కోల్పోయి కళ్లు తిరిగే ఈ స్టంట్‌ను అతి పెద్ద ఊయలపై చేయాలి.



ప్రాణాలు పైపైనే పోయేంత గగుర్పొడిచే ఈ ఆటకు 'కిల్ కింగ్' అని అర్థవంతంగానే పేరు పెట్టారు. 1993లో మొదలైన ఈ ట్రెండ్‌తో చిన్నాపెద్ద దెబ్బలు, ఎముకలు విరగటాలు సర్వ సాధారణం. అప్పట్లో ఎస్తోనియావాసి అడో కోస్క్ తలకిందులుగా తిప్పేస్తూ గుండ్రగా తిరిగే ఉయ్యాలను రూపొందించాడు. దీనిని మరింత పెద్దది చేస్తూ చాలా ఎత్తుకు చేర్చారు. పట్టి ఉంచే బెల్ట్‌లకు పాదాలను కట్టి గిర్రున తిరుగుతారు ఆటగాళ్లు. ఎత్తును పెంచుకుంటూ పూర్తి రౌండ్ వేయడమే పోటీల తీరు. సాధారణంగా 4 మీటర్లు ఊగేయగలరు. కానీ, 2015లో కాస్పర్ టైమ్సూ 7.15 మీటర్ల ఎత్తులో పూర్తి చుట్ట ఊగేసి గిన్నిస్ రికార్డు నెలకొల్పాడు. దీన్ని పూర్తిస్థాయి క్రీడగా తీసుకుని ఆరేడేళ్ల వయసు నుంచే ప్రాక్టీస్ మొదలెట్టేవారు ఎక్కువే ఎస్తోనియాలో.



గుహ గ్రామం

కొండ ప్రాంతాల్లో ఎన్నో గుహలను చూస్తుంటాం. అందులో చిమ్మ చీకటి, ఎటుచూసినా అంధకారం, అడపా దడపా జంతువులు, పక్షులు తప్ప మరేమీ కనబడవు. కానీ ఇక్కడున్న గుహ లోపల ఏకంగా ఓ గ్రామమే ఉంది. అక్కడ ఇళ్లు, స్కూలు, ఫుట్‌బాల్ కోర్టు, టెన్నిస్ బల్లలు, టీవీ, కరెంటు లాంటి వసతులూ ఉన్నాయి. అక్కడి వారు ప్రభుత్వం కేటాయించిన ఇళ్లను కూడా కాదనుకుని 'గుహే మా స్వర్గం' అంటున్నారు. ఇదెలా సాధ్యం అనుకుంటే ఒకసారి గుహలోకి తొంగి చూడాల్సిందే.

విశేషం

నైరుతీ చైనాలోని జియాంగ్ జెమీన్ ప్రాంతంలోని అన్సన్ పర్వత ప్రాంతంలో ఉందీ గుహ. ఎన్నో శతాబ్దాల క్రితం కొందరు మియో అనే గిరిజన జాతివారు ఇక్కడికి వచ్చి స్థిరపడ్డారు. అందుకే దీనికి మియో గ్రామం అని పేరు వచ్చింది. గుహ చుట్టూ అడవులు, ఎత్తైన చెట్లు, వింతైన శిఖరాలు, అందమైన జలపాతాలున్న ఆ ప్రకృతి దృశ్యాన్ని చూస్తుంటే మనల్ని మనమే మైమరచిపోయేంత మనోహరంగా ఉంటుంది. గుహ ముఖద్వార డిజైన్ చెయ్యి తిరిగిన శిల్పి చెక్కాడేమో అనేట్లు ఉంటుంది. 230 మీటర్ల పొడవు, 115 మీటర్ల వెడల్పు, 50 మీటర్ల ఎత్తు కలిగి ఉన్న ఈ గుహకు రాతి కాలిబాట ఉంది. గుహ దగ్గరికి వెళ్లాలంటే ఒక గంట నడవాల్సిందే. అలా నడుస్తూ వెళ్తుంటే ఎంతో అద్భుతంగా అనిపిస్తుంది. మియోలు మూడు కిలోమీటర్ల ఎత్తులోనున్న కొండపై జలపాతం నుండి వచ్చే నీళ్లను ఉపయోగించుకుంటారు. ఆ నీటితోనే క్వారీ దగ్గరలోఉన్న కొండలలో గోధుమను గది పెంచుతారు.

గుహలో ఎండాకాలంలో చల్లగా, చలికాలంలో వెచ్చగా ఉండటమేగాక తగినంత సూర్యరశ్మి, వెలుతురు, గాలి వస్తుంది. ప్రస్తుతం ఇక్కడ 18 ఇళ్లు ఉన్నాయి. వెదురు పుల్లలతో తయారు చేసిన ఆ ఇళ్లకు పైకప్పు ఉండదు. బెంచీలు, పరుపులు, భోజనాల కోసం డైనింగ్ టేబుల్, వినోదానికి టీవీ కూడా ఉంది. విచిత్రం ఏమిటంటే ప్రతి ఇంటి తలుపుకు డోర్ నెంబర్లు వుంటాయి. ప్రతి రెండు ఇళ్ల మధ్య వెదురుతో చేసిన కంచెలు కనిపిస్తాయి.



ఇళ్లు పరిమితమైన సైజులో ఉన్నా వీరి మధ్య ప్రేమానురాగాలు మాత్రం అపరిమితంగా ఉంటాయి. ఈ మియో గ్రామంలో కేవలం మనుషులే కాదు పశువులు కూడా వున్నాయి పాఠశాల సైతం ఉంది. 1984లో స్థాపించిన ఈ పాఠశాలలో సుమారు 200 మంది విద్యార్థులు వరకు చదువుకున్నారు. క్రమేణ ఇక్కడి పిల్లలను దగ్గరలోనున్న మెరుగైన పాఠశాలకు మార్చడంతో 2010లో స్కూలుని మూసివేశారు. దీంతో తరగతి గదులు, బాస్కెట్‌బాల్ మైదానం, టెన్నిస్ టేబుల్ నిర్మానుష్యంగా ఉండిపోయాయి. వీరు పట్టణ ప్రాంతానికి చాలా దూరంగా నివసిస్తున్నందున ఏ వస్తువు అవసరమైనా 15 కి.మీ. కాలినడకన వెళితేగానీ మార్కెట్ రాదు. అందుకే వారానికి సరిపడా సరుకులు ఒకేసారి తెచ్చుకుంటారు. మియోలు బుట్టలు తయారు చేయడం, వరి, గోధుమ పంటలను పండించడం, ఆవులను, పందులను పెంచడం లాంటి పనులు చేస్తుంటారు. వీరు తయారు చేసిన వస్తువులను అమ్మడానికి వారానికొకసారి కాలినడకన పట్టణానికి వెళ్తారు. అక్కడ మగవారికి ఇంట్లో తయారుచేసిన రైస్‌వైన్‌ను తాగే అలవాటుంది.

2003లో హురాన్స్ బోడ్ అనే అమెరికన్ మియో గ్రామాన్ని సందర్శించాడు. కరెంటు లేక బుడ్డీ దీపాల వెలుతురులో వారు పడే ఇబ్బందిని చూసి చలించిపోయాడు. 10 లక్షలు ఖర్చు పెట్టి కరెంటును ఇప్పించడమేగాక పశువులు కొనుక్కోడానికి నిధులను ఇచ్చాడు. గుహల్లో గడిపే విచిత్ర జీవితంపై డాక్యుమెంటరీ తయారు చేసి టీవీల్లో ప్రసారం చేశారు. ఆ డాక్యుమెంటరీని చూసిన ఒక అమ్మాయి అక్కడి పిల్లలకు చదువు నేర్పడానికి ముందుకొచ్చింది. కొందరు గ్రామపెద్దలు ప్రభుత్వ సహకారంతో రోడ్డును నిర్మించినందున ఒక గంట నడిస్తే రహదారిలోకి రావచ్చు. గతం కంటే వారి జీవితాలు కొంత మెరుగైనవి. పిల్లలు స్కూళ్లకు వెళ్లడానికి, పండించిన పంటను మార్కెట్‌కు తరలించడానికి ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం మోటార్ టాక్సీలు నడుపుతున్నారు. ఇదంతా గమనించిన ప్రభుత్వం రోడ్డు మార్గంలో ఇళ్లను నిర్మించి ఇచ్చింది. కాంక్రీట్ ఇళ్లలో రక్షణ ఉండదని భావించిన మియోలు 'మా గుహే మాకు స్వర్గం' అంటూ వాటిని నిరాకరించారు. నీళ్ల సమస్య రాకుండా వాటర్ ట్యాంక్‌లను ఏర్పాటు చేసుకున్నారు. పిల్లలు స్కూలు నుండి వస్తూ వార్తా పత్రికలు, మ్యాగజైన్‌లను తెచ్చుకుంటారు. అయితే ప్రస్తుతం ఆ గ్రామంలోని యువకులు చాలామంది చదువు కోసం, ఉద్యోగాల కోసం బయటి ప్రాంతాలకు వెళ్లగా ప్రస్తుతం 70 మంది మాత్రమే ఉన్నారు.

- ఇహశ్రీ

వాళ్లు... సాధించార



ఇంతకీ ఎవరా బామ్మ అంటారా? ముంబైకి చెందిన ప్రిమ్లా హింగోరని. ఈ వయసులో కూడా ఎరోబిక్స్‌తో ఆమె రోజు మొదలౌతుంది. తర్వాత బ్రిస్క్ వాక్. ఆ తర్వాత రన్నింగ్...ఇలా బిజీ బిజీగా వుంటుంది ఆమె టైమ్‌టేబుల్. గత ఏడాది 100 రోజుల్లో 500 కిమీ దూరం పరుగెట్టింది. దానికే ఆశ్చర్యపోతే ఎలా! ప్రతి సంవత్సరం జరిగే మారథాన్‌లో ఉత్సాహంగా పాల్గొంటుంది. అందుకోసం

వయసు 72.. రోజులు 100...పరుగు 500 కిమీ

నిత్యం సాధన చేస్తూనే వుంటుంది. వాతావరణం ఎలా వున్నా పరుగు మాత్రం ఆపదు. అయినా ఆడవాళ్లకు అదెలా సాధ్యం? అంటారేమో! కుటుంబం కోసం 24 గంటలూ వెచ్చిస్తాం. అలాంటిది మనకోసం మనం కనీసం రోజుకి 2 గంటలైనా ఇచ్చుకోలేమా? అంటుంది ప్రిమ్లా! చదువుకునే రోజుల్లోనే ప్రిమ్లా మంచి క్రీడాకారిణి. కాలేజీలో వుండగానూ పరుగు ఆపలా! తర్వాత పెళ్లయి పిల్లలు కలిగాక సైతం అంతే. పిల్లలతో కలిసి పరుగెత్తేది. ఇప్పుడు వృద్ధాప్యంలోనూ ఆపడంలా. ఓపిక ఉన్నంత వరకు చేయగలిగినంత కాలం పరుగెడతానంటోంది. మహిళా మణులూ చదివారా!

గతేడాది వే
నగరవాసుల
ఎన్జీఓలో చే
బోర్ కొట్టేసి

అ
అంటే చాలు.
ప్రదర్శించేవారికేం కి
కోట్లాదిగా కనిపిస్తారు. వా
కూడా ఆలోచించుకోకపోతే
తలొంచుకుని తాళి కట్టించే
ప్రతిష్ఠలున్న రాజకీయ నా
భరించాలా? యాక్సిడెంట్
వదిలేయాలా? ఇంగ్లీషు
పల్లెవాసులను వారి వ
విడిచిపెట్టేస్తామా? అరి
జాగ్రత్తలు తీసుకోనక్కర్లే
ఈ ఐదుగురు అ
చె

ఇష్టం లేని పెళ్లి ఒద్దంది

ఫ్యాషన్ డిజైనర్ అయింది



ఈ మధ్య యువత ఎక్కువ ఆసక్తి చూపిస్తున్న రంగం ఫ్యాషన్ డిజైనింగ్. ఈ రంగంలో పేరున్న డిజైనర్ వైషాలి షదంగుళే. విదేశీ వస్త్రాలపై సాంప్రదాయ అల్లికల మేళవింపుతో తను డిజైన్ చేసే దుస్తులు ఇప్పుడు బాలీవుడ్‌లో కొత్త ఫ్యాషన్ ట్రెండ్. విద్యాబాలన్, సోనా మల్హోత్రలకి ఇష్టమైన డిజైనర్ కూడా. బాలీవుడ్ బెస్ట్ డ్రెస్డ్ ప్రోగ్రామ్‌కి హోస్ట్‌గా పని చేస్తున్నారు. వైషాలీస్ ఫ్యాషన్ పేరుతో సొంత డిజైనింగ్ సంస్థని నిర్వహిస్తున్న ఈ డిజైనర్ నేపథ్యం తెలిస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే.

మధ్య ప్రదేశ్‌లోని ఒక చిన్న నగరం విదిషలో పుట్టింది వైశాలి. చిన్నతనం నుంచే ఫ్యాషన్ డిజైనింగ్‌పై అభిరుచి వుండేది. 18 ఏళ్ల వయసులో ఫ్యాషన్ డిజైనర్‌గా మారాలన్న తన ఆలోచనని తల్లిదండ్రులతో పంచుకుంది. దీనికి తండ్రి ఏ మాత్రం ఒప్పుకోకపోగా తనకి పెళ్లి చేసేయాలనుకున్నాడు. పెళ్లి చేసుకోవడం ఏమాత్రం ఇష్టంలేదామెకు. ఏంచేయాలో తెలీలా. ఓ రోజు ఉదయాన్నే ఇంటి నుండి బయటపడి రైల్వేస్టేషన్‌లో ట్రెయిన్ ఎక్కేసింది. అలా భోపాల్‌కి చేరుకున్న తనకి ఆరోజు స్టేషన్‌లోనే గడపాల్సి వచ్చింది. తర్వాత ఒకరు తనకి ఆఫీస్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇవ్వడంతో కాస్త ఉపశమనం లభించినా హాస్టల్ ఫీజులు, ఆహారం అన్నిటికీ డబ్బు సరిపోయేది కాదు. అందుకోసం ఒక జిమ్‌లో ట్రెయినర్‌గా పనిచేసేది. అక్కడికొచ్చే వారికి నప్పే దుస్తులని సూచిస్తుండేది. ఆ ఐడియాలు వారికి తెగ నచ్చేసేవి. అలా వారికి బట్టలని డిజైన్ చేసేది. ఆ తర్వాత బ్యాంక్ రుణం ద్వారా ఇద్దరు దర్జీలతో మలాడ్ ప్రాంతంలో తను ప్రారంభించిన చిన్న బొటిక్ ఇప్పుడు వైషాలీస్ డిజైన్లతో మూడంతస్తుల షోరూమ్‌గా రూపుదిద్దుకుంది. ఢిల్లీ ఫ్యాషన్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్‌లో డిప్లమా కోర్సు పూర్తి చేసింది. తను డిజైన్ చేసిన క్యాజా స్టైల్ దుస్తులు తనకి మంచి గుర్తింపునందించాయి. లైఫ్ స్టైల్, విల్స్ ఫ్యాషన్ వీక్‌లలో తన డిజైన్లు ప్రదర్శితమయ్యాయి.

ు..

పిల్ల
ులకన భావన
ువ లేదు. మన చుట్టూ
ు సరే. మన గురించి మనం
లా? ఇష్టం లేని పెళ్లి చేస్తానంటే
ుకోవాలా? సమాజంలో పేరు
ుకుడు వేధిస్తుంటే మౌనంగా
ులైన ఆడపిల్లను అలా చూస్తూ
క ఆత్మన్యూనతతో బాధపడే
ానాన వారిని అజ్ఞానంలో
్యం కోసం మనకు మనం
ు? వంటి ప్రశ్నలకు ఇదిగో
వాళ్లు సమాధానం
ురు.

పల్లెటూరివారికి ఇంగ్లీషు నేర్పింది

గ్రామాలలో పుట్టి పెరిగిన వారికి ఇంగ్లీషు ఎంత పెద్ద సమస్యో తెలియనిది కాదు. ఇంగ్లీషు మాట్లాడలేకపోవడాన్ని చిన్నతనంగా భావించి ఆత్మన్యూనతతో కుంగిపో తుంటారు. అలాంటి గ్రామాలు, గ్రామస్తులకు మన దేశంలో కొదవే లేదు. ముంబై సమీపంలోని ఖామ్‌గావోన్ సరిగ్గా అలాంటిదే. అయితే వారికి దివ్య షా అనే పదహారేళ్ల బుల్లి టీచరమ్మ లభించడంతో ఇంగ్లీషు అంటే భయం పోయి గడగడా మాట్లాడేస్తున్నారు.అదంతా
ు సెలవుల్లో అనుకోకుండా జరిగిపోయింది. పదహారేళ్ల దివ్య చాలా మంది
ు మాదిరిగానే వేసవిలో ఏదైనా నేర్చుకుందామనుకుంది. అలా స్వదేశ్ అనే
ుది. అక్కడ ఆమెను స్వయం సహాయక బృందాల పని అప్పగించారు. వారానికే
ు. ఓరోజు తోటి సభ్యుడితో కలిసి ముందు మనం చెప్పుకున్న గ్రామం వెళ్లింది. అక్కడ ఇంగ్లీషు రాక వారు పడే అవస్త చూసిన మరుక్షణం తనకు చేతనైన సాయం చేయాలని నిర్ణయించుకుంది. వెనక్కి వచ్చాక స్వదేశ్ సిఇఓ ముందు తన ఆలోచన వుంచింది. ఆయన అంగీకరించడంతో మరునాడే గ్రామం వెళ్లిపోయి పెద్ద మనసుతో ప్రేమగా ఆహ్వానించిన కుటుంబంతో పాటే వుండసాగింది. ఊళ్లో స్వదేశ్ నడిపే కుట్టుమిషన్ క్లాసును బాగా ఉపయోగించుకుంది. అక్కడికి వచ్చే వారికి ఇంగ్లీషు నేర్పుతానని ఇంటింటికి వెళ్లి అడిగింది. మొదట వారం రోజులు ఒకరు...ఆ తర్వాత ఇద్దరు...ఇలా రెండు మూడు వారాలయ్యేసరికి ఊరు మొత్తం వచ్చేసింది ఇంగ్లీషు నేర్చుకోవడానికి. వాళ్లని మూడు బృందాలుగా (స్కూలు పిల్లలు, గృహిణులు, కాలేజీ పిల్లలు) విడగొట్టి తరగతులు చెప్పింది దివ్య. చిన్న చిన్న ఆంగ్ల పదాలతో వాక్యాలను అల్లడం ఎలాగో నేర్పింది. చివరికి కోర్సు పూర్తయ్యాక తనకు వీడ్కోలు పలికిన తీరు దివ్య మనసులో నేటికీ తాజాగా వుండిపోయింది. ఆరోజు తన దగ్గర ఇంగ్లీషు నేర్చుకున్న ఇద్దరు గృహిణులు కూరగాయలు ఏం కొనాలో ఇంగ్లీషులో చర్చించుకోవడం చూసి పొంగిపోయింది. ఎప్పటికీ ఆమె చేసిన సాయాన్ని మరువలేమంటూ చిన్నారులు ఇంగ్లీషులో ఆమెకు వీడ్కోలు పలికిన తీరు గుర్తొస్తే నేటికీ కళ్లు చమర్చకుండా వుండలేదు దివ్య.

అపరిచితకు ప్రాణం పోసి...

ఆరేళ్ల కిందట బెంగళూరు రోడ్డు మీద ఓ యాక్సి డెంట్. ఒక యువతి బస్సు ప్రమాదంలో చిక్కుకుంది. చుట్టూ జనం. చోద్యం చూస్తున్నారు. సాయం చేసేందుకు ముందుకు రావడంలేదు. అప్పుడు సరిగ్గా లిండా జాన్సన్ ఘటన జరిగిన ప్రదేశానికి వచ్చింది. గుంపును తోసుకుని లోపలికెళ్లి చూస్తే కనిపించిన దృశ్యమది. సాయం చేయమని అడిగితే ఒక్కరు ముందుకు రాలా! చిన్నతనంలో తల్లిదండ్రులు నేర్పిన విషయం గుర్తొచ్చింది. ఆపదలో వున్న వారి ప్రాణాలు కాపాడే అవకాశం వస్తే రెండో ఆలోచన లేకుండా సాయం చేయమని వారు చెప్పిన విషయం మనసులో మెదిలింది. వెంటనే అతి కష్టం మీద గాయపడిన అమ్మాయిని బస్సు కింది నుంచి బయటికి లాగింది. ఈ లోగా మరో మనసున్న అమ్మాయి తనకు సాయంగా వస్తానంటే ఆమెను కూడా ఆటోలో ఎక్కించుకుని ఆస్పత్రికి వెళ్లారు. మార్గ మధ్యలో గాయాల తాలూకు నొప్పులు ఓర్చుకోలేక ఆమె పెట్టే కేకలతో ఆటో అదిరిపోయింది. దారి పొడవునా ఆమెను ఓదార్చుతూనే వుంది లిండా. సరైన సమయంలో వైద్యం అందడంతో అమ్మాయి ప్రాణాలు కాపాడగలిగింది. యాక్సిడెంట్ అయిన అమ్మాయి హేమ. కేరళ వాసి. పెళ్లి కాలేదు. తమ బిడ్డను కాపాడినందుకు వారామెకు ఎంతగానో కృతజ్ఞతలు చెప్పుకున్నారు. ఇప్పటికీ లిండా, హేమ మంచి స్నేహితులు. ఈ కదిలించే ఘటన, అందులో లిండా చేసిన సాయం, ఏ ఒక్కరికి స్ఫూర్తినిచ్చినా సంతోషమే.

పోకిరి పని పట్టేసింది



తెల్లారి లేచింది మొదలు అర్ధరాత్రిళ్లు కూడా రాంగ్ కాల్స్ మోత మోగిపోతుంటే! అది కూడా నీ రేటెంత? వంటి అసభ్య పూరిత ప్రశ్నలతో వేధించేవైతే! తప్పు ఎక్కడ జరిగిందో తెలీక నిద్రాహారాలు లేకుండా అల్లాడిపోతాం. కేరళకు చెందిన శ్రీలక్ష్మి సతీష్‌ది కూడా అదే పరిస్థితి. అవతలి వారు సైతం ఈమె వేశ్య అనే అనుకుంటున్నట్టు మాటలను బట్టి ఆమెకు తెలుస్తోంది. ఒకానొక ఫోన్ కాలర్‌ని బతిమాలి తన నెంబర్ ఎలా తెలిసిందో రాబట్టింది. బాగా ఎరిగిన, రాజకీయ నాయకుడు ఆ పని చేశాడని తెలిసి ఆశ్చర్యపోయింది. అదీ వాట్స్ యాప్‌లో తన పేరు, ఫోన్ నెంబర్ వుంచాడని తెలిసి షాకైంది. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేద్దామనుకుంది. వృద్ధ తండ్రి, సదరు పార్టీ పెద్దలు ఒద్దన్నారు. అదనపు సమస్యలు తలెత్తే అవకాశముందని వారించారు. అయితే ఆమె మరో మార్గాన్ని సూచించింది. అతన్ని పార్టీ పదవి నుంచి తొలగించడమే కాక, పాతిక వేల రూపాయల జరిమానా చెల్లించి రసీదు ఇస్తేనే కేసు ఆలోచన విరమించుకుంటానంది. చివరికి సాధించింది. పొగరుబోతు యువ రాజకీయ నాయకుడికి శ్రీలక్ష్మి బుద్ధి చెప్పిన వైనం ఎంతో మంది యువతులకు స్ఫూర్తినిస్తోంది.

(మార్చి 8 మహిళా దినోత్సవం సందర్భంగా...) - స్నేహ డెస్క్

కవిత్వమ్

ఒక గుప్పెడు రాత్రులు

రాత్రులన్నీ
సజావుగా నిద్రపోవు
గుప్పెడు జ్ఞాపకాలు తట్టి
మది కదలి
కల్లోలితమవుతుంది

ఈ ప్రపంచీకరణ ప్రపంచం
వైకుంఠ పాళీ అవుతుంది

కదిలే అడుగులలో
వొణికిన సవ్వడులెన్ని

ముంచుతున్న పనివేళల
మంచు తెరల వెనుక
నలిగిన జీవికలెన్ని

మబ్బుల్ని ఢీకొట్టి
మంటల్ని ఊపినట్లు
ఊపిరి ఉక్కపోతతో
బిగుసుకుంటుంది

ఆశంతా
ఒక గుప్పెడు రాత్రులు
ఎగసీ
నిద్ర పుచ్చేవి
రెక్కలు కట్టుకు ఉగుతుంటాయనీ
కలగంటూ...నేను !

- గవిడి శ్రీనివాస్
07019278368

అలలా..

ఏకాంతం నిశ్శబ్దంగా పరచుకోగా
నిరీక్షణ నిండిన చూపులు
వాకిళ్ళను దాటి
చివర్ని చేరుతున్న
మొదళ్ళను పట్టుకున్నాయి

తెల్లబడ్డ ఇంద్రధనస్సులా
మెరుస్తున్న నీడను
దేహం నుండి వేరుచేసైనా
నిట్టనిలువునా నిలబెట్టాలని...

కూలుతున్న వర్తమానాన్ని
వాస్తవంగా నిశిగా చూపే అద్దం నుండి
యేమార్చాలని...

ప్రతిసారీ శిథిలమౌతున్న చిరునవ్వులను
మళ్ళీ మళ్ళీ సృజించాలని....

ఈ రమణీయ విషాదాన్ని
దీపం కింద నీడనులా చెరిపేయాలని....

ఇంకా...
అల వెంట అలలా
నీ వెంటే నేనుండాలని వుంది.

- కళ్యాణదుర్గం స్వర్ణలత
9848626114



తెలుసా

అద్భుత ద్వీపాలు

- చుట్టూ నీటితో ఉన్న భూభాగాన్ని ద్వీపం లేదా దీవి అని పిలుస్తారు.
- ప్రపంచంలోని అతి చిన్న ద్వీపం పసిఫిక్‌లోని నౌరు. దీని విస్తీర్ణం 8.5 చదరపు మైళ్ళు.
- 2011 లెక్కల ప్రకారం నౌరు జనాభా 9,945మంది. ప్రపంచంలోనే అతి తక్కువ జనాభా కలిగిన ఏకైక దేశం ఇదే.
- గ్రేట్ బ్రిటన్ ప్రపంచంలో తొమ్మిదో అతిపెద్ద ద్వీపంగా ఉంది.
- అస్సాంలోని మజులీ ప్రపంచంలోనే అతి పెద్దదైన నదీ ద్వీపం.
- సముద్ర ద్వీపాలు గ్రేట్ బ్రిటన్, శ్రీలంక, అండమాన్, నికోబార్ దీవులు, లక్ష దీవులు
- వెనిస్ దీవి చెట్ల మోడు నుండి ఏర్పడింది. 1200 సంవత్సరాల తరువాత కూడా అదే మోడు వెనిస్ మధ్యన ఉంది.

- ఫాక్లాండ్ దీవులలో ఉన్న 90 శాతం మంది బ్రిటీష్ సంతతికి చెందినవారే.
- ఈ ద్వీపంలో దాదాపు 5 లక్షల గొర్రెలు ఉంటున్నాయి.
- ఫాక్లాండ్ దీవులలో ఇంగ్లీషు అధికారిక భాష అయినప్పటికీ కొంతమంది స్పానిష్ మాట్లాడుతుంటారు.
- ఫాక్లాండ్ దీవిలో ఒక బ్యాంక్ మాత్రమే ఉంది. ఏటియంలు ఉండవు.
- ప్రపంచంలోనే పెద్ద భవనంగా కట్టబోయే అజర్‌బైజాన్ టవర్ ఫాక్లాండ్‌లోనే ఉంది.
- లక్షద్వీప్‌లో నున్న అగాథీ ఎయిర్‌పోర్టు ఇండియాలోనే అందమైన ఎయిర్‌పోర్టు.

- సీతాకోక చిలుకలు ఎక్కువగా ఉష్ణమండల ద్వీపాల నుండి చల్లదనం కోసం అండమాన్ నికోబార్ దీవులకు వస్తుంటాయి. అందుకే దీనిని 'హ్యాపీ లాండ్ ఆఫ్ బటర్‌ఫ్లైస్' అంటారు.
- భారతదేశంలో రగులుతున్న ఏకైక అగ్నిపర్వతం అండమాన్‌లోనే ఉంది.



- లక్షద్వీప్‌లోని 39 ద్వీపాలలో కేవలం పదింటిలో మాత్రమే మనుషులు నివసిస్తున్నారు.
- లక్షద్వీప్‌లో అండ్రోత్ అతి పెద్ద ద్వీపం. ఇది కేరళ తీరంతో ముగుస్తుంది.
- ఈ ప్రాంతంలో 90 శాతం జనాభా ముస్లిం మతస్థులే.

- అండమాన్, నికోబార్ అనే పదాలు మలై (మలేషియన్‌ల)భాష నుండి తీసుకొనబడినవి.
- అండమాన్, నికోబార్‌లలో బెంగాలీ, హిందీ, తమిళం, తెలుగు, మలయాళ భాషలను ఎక్కువగా మాట్లాడుతారు.
- అండమాన్ ద్వీపాలలో ఎక్కువగా ఉండే జార్వా ఆదిమజాతికి బయట ప్రపంచంతో సంబంధాలు ఉండవు.
- 20 రూపాయల నోటు వెనుక అండమాన్ నికోబార్ దీవుల దృశ్యం ఉంటుంది.

- అండమాన్‌లో 70 శాతం మంది బెంగాలీ సామాజిక వర్గానికి చెందినవారే.
- అండమాన్‌లో ఎక్కువగా వరి, కొబ్బరి, వక్క, చెరుకు, పప్పులు, పండ్లు కూరగాయలు పండుతాయి.

- అందమైన ద్వీపాలలో హేవ్లాక్ ద్వీపం ఒకటి. పర్యాటకులను ఏనుగు మీద కూర్చోబెట్టి ద్వీపమంతా తిప్పుతూ చూపించడమే ఇక్కడి ప్రత్యేకత.
- హేవ్లాక్ ద్వీపంలో రాధానగర్ బీచ్, ఎలిఫెంట్ బీచ్, ఎమిరాల్డ్ జెకో, ఫుల్ మూన్ కేప్, కలాపాథర్ బీచ్ ముఖ్యంగా చూడదగ్గ ప్రదేశాలు.
- ఈ మిలీనియంలో మొదటి సూర్యోదయాన్ని చూసిన మానవ ఆవాసిత ద్వీపం కట్చల్ ద్వీపం. ఇది నికోబార్ సమీపంలోనున్న చిన్న ద్వీపం.



దత్త పుత్రులు

కథ

శేష చంద్ర
9440581463



పద్మముఖి పద్మపాణి కన్నా రెండేళ్లు చిన్న. ఆమె పౌరసరఫరాల సంస్థలో జిల్లా మేనేజర్ అయితే పద్మపాణి తహశిల్దారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలకు ఇంకా పదవీవిరమణ పరిమితి అరవై సంవత్సరాలకు పెంచకపోవడంతో ఇద్దరు ఒకేసారి రిటైర్ కాబోతున్నారు. వాళ్లకి ఇద్దరు కొడుకులు ఒక కూతురు. పెద్దోడు అమెరికాలో, చిన్నోడు ఆస్ట్రేలియాలో స్థిరపడితే కూతురు అల్లుడితో పాటు బెంగళూరులో ఉంది. పదవీ విరమణ వయస్సు వచ్చేసరికి చాలా మందికి ఉండే బాధ్యతలు అంటే పిల్లలకు పెళ్లిళ్లు కాకపోవటం లేదా ఉద్యోగాలు లేక స్థిరపడక పోవటం లేదా ఇంకా చదువులు కొనసాగిస్తుండటం వంటి సమస్యలు లేవు. ఇద్దరు కొడుకులు, అల్లుడు బాగా డబ్బులు సంపాదించి మంచి ఉద్యోగాల్లో స్థిర పడ్డారు. దాంతో వారికి పిల్లలకు చేయాల్సిన బాధ్యతలు ఏమీ లేవు. అంతే కాకుండా భార్యాభర్తలిద్దరికి వయస్సుతో పాటు వచ్చే బి.పి షుగర్ లాంటి సమస్యలు కూడా లేవు.

తమ పదవీ విరమణ వేడుకను చాలా ఘనంగా చేయడానికి అమెరికా , ఆస్ట్రేలియా పోయినప్పటి నుండి ఒక్కసారి కూడా ఇండియాకు రాని కొడుకు కోడళ్లు పిల్లల్తో పాటు ఓ మూడు రోజుల ముందొస్తున్నామని కబురు రావడంతో వాళ్ల ఆనందానికి హద్దుల్లేవు. దాంతో పాటు కూతురు అల్లుడు పిల్లల్తోపాటు వస్తున్నామని చెప్పడంతో చాలా హడావుడి పడసాగారిద్దరు. వాళ్లు తమ పిల్లలైనా ఇన్ని సంవత్సరాల తరువాత వస్తున్న వాళ్లకి ఏ లోటు రాకుండా చేయాలని ఆరాట పడసాగారు.

రేపటి రోజు వాళ్లంతా విమానంలో దిగి సాయంత్రానికి అంతా ఇంట్లో ఉంటారనుకుంటుంటే ముందు రోజే టాక్సీ ఇంటి ముందు ఆగడంతో ఆశ్చర్యమేసి ఎవరబ్బా అని ఆలోచిస్తూ ఇంట్లోంచి బైటికి వచ్చాడు పద్మపాణి. టాక్సీకి డబ్బులిచ్చేసి ఇద్దరు పిల్లల్తో ఓ ఆడ మనిషిని వెంటపెట్టుకొని వస్తున్న మనిషిని చూసి ఆశ్చర్యపోతుండగానే, 'నమస్కారం బాబాయ్' అంటూ పద్మపాణి కాళ్లను తాకాడతను. అతనితో పాటు ఆమె.

అతన్ని గుర్తుపట్టలేక ఆలోచనలో పడ్డ పద్మపాణితో, 'నేను బాబాయ్ భార్గవను. ఈమె మీ 'కోడలు అనన్య, పిల్లలు... కీర్తి, స్ఫూర్తి' అన్నాడా వచ్చిన వ్యక్తి తనెవరో గుర్తు చేస్తూ.

'భార్గవ అంటే .... సోమేశ్వర్ కొడుకువా?!' సందిగ్ధంలోంచి తేరుకొంటూ పద్మపాణి అంటుండగానే అతని వెనకాలే వచ్చిన పద్మముఖి.... 'ఒరే బార్గవా! నువ్వా... రా..' అంటూ ఆప్యాయంగా దగ్గరకు తీసుకొంది.

తేరుకున్న పద్మపాణి కళ్లు చెమర్చాయి. 'ఒరే భార్గవ్ ఎంతవాడివయ్యావురా' అంటూ గాఢంగా ఆలింగనం చేసుకొన్నాడు. ఎన్నేళ్లైందిరా నిన్ను చూసి?! అందుకే వెంటనే గుర్తు పట్టలేక పోయాను. నీ దగ్గర్నుంచి ఫోన్లు తప్ప మనిషి వచ్చింది లేదు. దాదాపు ఐదేళ్లు కాలేదు... నువ్వు అమెరికా వెళ్లి? ఇంతకీ ఏం చేస్తున్నావ్? జీవితంలో స్థిరపడ్డావా లేక ఇంకా ....' అంటూ ప్రశ్న మీద ప్రశ్న వేయసాగాడు.

'ముందు వాడ్ని లోపలికి రానివ్వండి. అన్నీ వివరంగా చెప్తాడు. వచ్చిన వాడు చెప్పకుండా అట్నుంచి అటే వెళ్లడు' అంటూనే 'రండమ్మా రండి లోపలికి' అంటూ అనన్యను, పిల్లల్ని ఆహ్వానించింది పద్మముఖి.

సోమేశ్వర్ పద్మపాణి అన్న కాదు. సహ ఉద్యోగి. దాదాపు పది సంవత్సరాల క్రితం ఓ రోజు మోటర్ బైక్ ప్రమాదంలో సోమేశ్వర్ అతని భార్య మరణించి భార్గవ్‌ని ఒంటరి వాడిని చేసి వెళ్లిపోయారు. సోమేశ్వర్‌కు వెనకా ముందు ఎవరూ లేరు. దానికి తోడు అతను బతికున్నప్పుడు దాచిందేమీ లేదు. దాంతో భార్గవ్ పదిహేనేళ్లకే రోడ్డున పడాల్సి వచ్చింది.

అలాంటి సమయంలో అన్నీ తనై ఆదుకున్నాడు పద్మపాణి. తన ఇద్దరు కొడుకులతో పాటు సమంగా చదువు చెప్పించాడు. భార్గవకి స్వతహాగా మంచి తెలివి తేటలుండటంతో పద్మపాణి కొడుకులకన్నా మంచి మార్కులు తెచ్చుకొనేవాడు. దాంతో కొడుకులకు వాడంటే అసూయ. అతన్ని తల్లిదండ్రులిద్దరు మెచ్చుకోవటం సహించే వాళ్లు కాదు. ఒకసారి చేయని దొంగతనం వాడి మీదికి నెట్టడంతో నిజం తెలిసిన పద్మపాణి వాడ్ని ఇంట్లో ఉంచటం అంత మంచిది కాదనుకుని హాస్టల్లో ఉంచి బాగోగులు చూసుకునేవాడు. పద్మపాణి ఆదరణతోనే ఎలాంటి సమస్యలు లేకుండా భార్గవ ఇంజనీరింగ్ పూర్తి చేసి హైద్రాబాద్‌లో ఉద్యోగం తెచ్చుకున్నాడు. ఆ తర్వాత పద్మపాణి, పద్మముఖిల సమ్మతంతో ఓ అనాథ పిల్ల అనన్యను పెళ్లి చేసుకొని అమెరికా వెళ్లిపోయాడు. చాలా సంవత్సరాల తర్వాత ఇండియాకు ఇదే రావడం.

అయిదేళ్ల నుంచి అమెరికాలోవున్నా అతి సాధారణంగా ఉన్న భార్గవ కుటుంబాన్ని చూసి ఆశ్చర్యమేసి 'ఏరా భార్గవ అయిదేళ్ల నుంచి



అమెరికాలో ఉంటున్నావ్. బాధ్యతలంటూ ఏమీ లేవు. భార్య పిల్లల వంటి మీద చిన్న పాటి నగలు కూడా లేవు. సంపాదనంతా ఏం చేస్తున్నావ్??' అంటూ మనసుండలేక నిలదీసింది పద్మముఖి.

దానికి భార్గవ చిరునవ్వుతో 'నీకు తెలుసు కదమ్మా! మొదట్నించి నాకు బంగారమంటే ఇష్టం లేదు. నాతో పాటు అనన్య, పిల్లలక్క్యాడా బంగారం మీద మోజు లేదు. అంతే తప్ప మరేం కాదు....'.

పద్మముఖి ఇంకా ఏదో అడగబోతుంటే 'నీకు సవాలక్ష అనుమానాలు.. వాడేం చిన్న పిల్లాడు కాదు డబ్బును ఏలా సద్వినియోగం చేయాలో వాడికి బాగా తెలుసుగాని ప్రశ్నలడగటం ఆపి వంట పని మొదలు పెట్టు' అంటూ

'రేయ్ భార్గవ! మీరు లోపలికెళ్లి ఫ్రెషప్ అవండి. భోజనాల తర్వాత తీరిగ్గా మాట్లాడొచ్చు, అవును మీ లగేజేది? కొంపదీసి టాక్సీలో వదల్లేదు కదా' అన్నాడు కంగారుగా.

'లేదు బాబాయ్. లగేజేమీ తేలేదు. లాడ్జిలో లగేజి పెట్టి ఫ్రెష్ అయి వచ్చాం.'

'లాడ్జీలో ఎందుకు?' అని కోపంగా అంటున్న పద్మముఖితో 'అదికాదమ్మ అన్న, తమ్ముడు, చెల్లి ఫ్యామిలీలతో వస్తున్నారు కదా.... అందరికి ఇబ్బందిగా ఉంటుందని' అన్నాడు భార్గవ. భార్యా భర్తలిద్దరికి కొడుకుల సంగతి మదిలో మెదిలి మౌనంగా ఉండిపోయారు.

ooo

లాన్ మల్లె జాజి పూల వాసనల్తో ఘుమఘుమలాడుతోంది. తెల్లని మబ్బుల మధ్య మరింత తెల్లగా వెలిగిపోతున్నాడు పున్నమి చంద్రుడు. ప్రకృతి ప్రేమికుడు పరవశించిపోయేలా పూల వాసనను చంద్రుని చల్లదనాన్ని మోస్తూ వగలు పోతోంది పిల్లగాలి. కాని లాన్‌లో కూర్చొని ఉన్న పద్మపాణి కొడుకులు, కూతురు వాటిని ఆస్వాదించే స్థితిలో లేరు. ఉదయమే దిగారు వాళ్ళు. చాలా సేపటి వాళ్లు చర్చించుకొంటున్నది ఒక విషయం గురించే. అదే తల్లితండ్రులిద్దరు రిటైరైపోయారు కదా వాళ్లకు వచ్చే డబ్బులు ఏలా పంచుకోవాలా అని........

'మమ్మీ, డాడీ ఇందుకు ఒప్పుకుంటారా?' సందేహం వెళ్లబుచ్చాడు పెద్దకొడుకు.

'ఒప్పుకోకపోవడానికి కారణమేముంది. రిటైర్ కాక ముందు మన దగ్గరికి వచ్చేందుకు వీలు పడలేదని చెప్పేందుకు కారణముండేది. కాని ఇప్పుడాసమస్య లేదు. ఈ వయస్సులో వాళ్లు ఒంటరిగా ఎలా ఉండగలరు. నీ దగ్గర కొద్ది రోజులు, నా దగ్గర కొద్దిరోజులుంటారు. ఇక వాళ్లు మన దగ్గరికొస్తే మనం ఇండియాకు రావాల్సిన అవసరమేముంటుంది? అప్పుడు ఈ ఇంటితోను పొలంతోను పనేముంటుంది? అందుకే వాటిని అమ్మేయక తప్పదు' అన్నాడు చిన్న కొడుకు.

ఈలోగా కూతురు అందుకుని 'నువ్వు చెప్పేది బాగానే ఉంది కానీ..! డాడీ మమ్మీ అంత సులభంగా ఒప్పుకోరేమో. వాళ్లు ఒప్పుకొంటే సమస్య లేదు. మనం పోయేలోగా మొత్తం క్యాష్ చేసుకోవచ్చు. ఇల్లు మంచి సెంటర్లో ఉంది. ఎవరైనా తీసుకొంటారు. కనీసం రెండు కోట్ల పైనే వస్తుందనుకొంటాను. ఫంక్షన్ అయిపోయాక డాడీకి చెబుదాం. ఇప్పుడే ఈ విషయం చెప్తే మనం దీని కోసమే వచ్చామనుకొంటాడు. అంతే కాదు డాడీకి మమ్మీకి గ్రాట్యుటీ, పి.ఎఫ్ వగైరాలు కలుపుకొని చెరి నలభై లక్షలకు తక్కువ కాకుండా రావొచ్చు. మొత్తం కలిపితే రెండో మూడో కోట్లు వస్తాయి!!. ఒక్కొక్కరికి కోటి వస్తాయన్న మాట, ముగ్గురికి పంచితే వస్తుందిఅంది ఆశగా !

'అయినా నీకు వాటా ఎందుకివ్వాలే?. నీ పెళ్లికి డాడీ ఎంత ఖర్చు పెట్టాడు... అప్పుడు మేమేమైనా నోరెత్తామా? అప్పుడు తీసుకుపోయింది చాలక ఇప్పుడు సమాన వాటాకు లెక్కలేస్తున్నావా?' అన్నాడు విసుగ్గా పెద్దోడు.

'అంటే నాకేమి ఇవ్వరా మొత్తం మీరే పంచుకొంటారా??' అంది ఉక్రోషంగా. ఆవేశపడకే నీకు ఇవ్వకుంటే నువ్వు మమ్మల్ని ఎక్కడ వదుల్తావులే. నీకో ఇరవై ఇస్తాంలే..' సర్ది చెప్తూ అన్నాడు చిన్నోడు.

'నీ ముష్టి ఇరవై నాకవసరం లేదు. మొత్తం మీరే తీసుకొని ఊరేగండి'. అంటూ రోషంగా అక్కడ్నుంచి లేచి వెళ్లబోతుంటే చిన్నోడు లేచి ఆమె చేయి పట్టుకొని కూర్చోపెట్టి, 'కోప్పడకే తల్లీ! కూర్చో ... ఏదో ఒకటి చేస్తాంలే. నీకు మేము ఇరవై ఇచ్చినా వచ్చింది వచ్చినట్లు మిగిలి పోతుంది. మా పరిస్థితి అలా కాదు కదా. మమ్మీ డాడీలు బతికినంత కాలం అన్నీ మేం చూసుకోవల్సిందేగా.. అది ఎంత కష్టమో నువ్వు ఆలోచించావా?' అన్నాడు సాలోచనగా

'వాళ్ల బాధ్యతలను మీరు చూసుకొనేదేమిటి లక్షణంగా చెరో ముప్పై వేలు పింఛను డబ్బులు వస్తాయి. ఇక అమ్మ ఎక్కడుంటే అక్కడ మీకు పని మనిషి అవసరం కూడా ఉండదాయే..'

'నీ బుద్ధి పోనిచ్చుకొన్నావు కాదు. పని మనిషిని తీసేసి అమ్మ చేత పని చేయుంచుకొంటామను కొంటున్నావా?' అన్నాడు కోపంగా పెద్దోడు.

'ఆహా... పాపం మీ భార్యల సంగతి నాకు తెలియదా? డబ్బులు చేతిలో పడినంత వరకే మీ మాటలు తరువాత వాళ్లను ఎంత బాగా చూసు కొనేది నాకు తెలియదా?' అంది వెటకారంగా.

'అవునే! మేము, మీ వదినలు ఎక్కడ చూసుకొంటామే. నువ్వు మమ్మీ డాడీలను అంత బాగా చూసుకొనేటట్లైతే నీ దగ్గరే పెట్టుకో. మరో పాతిక ఎక్కువిస్తాం... వాళ్లకొచ్చే ఆ డబ్బులేవో నువ్వే తీసుకో.'

'నాకేం ఆ ఖర్మ పట్టలేదు. మీ ఇష్టం మీరెట్టైనా చేసుకొని చావండి. కాని మర్యాదగా నా వాట నాకు ఇస్తానంటే నేను మౌనంగా ఉండి అమ్మానాన్నలను ఒప్పించే ప్రయత్నం చేస్తా... లేకపోతే ఎటువంటి పరిస్థితిలోను ఇంటిని అమ్మనివ్వను. డబ్బులు పైసా కూడా ఇవ్వనివ్వను. కాదు కూడదని చేసినా కోర్టుకీడుస్తా జాగ్రత్త' అంటూ విరుచుకుపడింది పద్మపాణి కూతురు.

పరిస్థితి అదుపు తప్పుతుండటంతో చిన్నోడు కల్పించుకొంటూ..... 'సర్లేవే నువ్వు ఆవేశ పడకు. మమ్మీ డాడీల దగ్గర అడ్డుపుల్ల వేయకు. అన్నట్లు ఆ భార్గవ గాడు కూడా వచ్చాడు. వాడికి అంతో ఇంతో ఇవ్వాలంటాడేమో డాడీ. వాడ్ని దత్తపుత్రుడిగా పెంచాడు కదా' అని టాపిక్ మార్చాడు.

'వాడికెందుకివ్వాలంటాడు. వాడేం ఇప్పుడు డబ్బుల్లేని వాడు కాదు కదా.. వాడు వాడి భార్య రెండు చేతుల్తో సంపాదిస్తుంటే' అన్నాడు పెద్దోడు.

'అవుననుకో ....కాని వాడేంటి అంత సంపాదిస్తున్నా ఒక దర్జా పాడు లేదు.

సాదాసీదాగా ఉన్నాడు..వచ్చే డబ్బు ఏం చేస్తున్నాడో? వాడి అవతారం చూసి ఎవరైనా వాడు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగని అనుకొంటారా? కొంపతీసి వాడేమైనా ఆర్థిక సమస్యల్లో వున్నాడేమో?! అందుకే పని కట్టుకొని మరీ వచ్చినట్లు ఉంది....'

లాన్‌లో కొడుకులు కూతురు కూర్చొని ఉండటం చూసి వాళ్లతో పాటు కొద్ది సేపు సంతోషంగా కాలం గడుపుదామని లోపలికి వస్తున్న పద్మపాణి మొదటి నుంచి వాళ్ల సంభాషణంతా వింటూ అక్కడే నిలిచిపోయాడు. వాళ్ళ ఇండియాకు వచ్చింది తమ మీద ప్రేమతో కాదని కేవలం ఉన్న ఆస్తి సెటిల్‌మెంటు చేసుకొని పంచుకోనేందుకు వచ్చారని తెలియడంతో అతని సంతోషం ఒక్కసారిగా ఆవిరైపోయింది. వాళ్లు తమని అభిమానించేది, ప్రేమను పంచేది కేవలం కృత్రిమమే అని తెలిసిన మరుక్షణం వాళ్లపైనున్న ప్రేమ అడుగంటి పోయింది. పద్మముఖికి వాళ్ల మాటలను చెప్పి పిల్లలపై ఆమెకున్న మమకారాన్ని వాళ్ల రాకతో పొందుతున్న సంతోషాన్ని దూరం చేయదల్చుకోలేదు. అందుకే గుండెల నిండా బాధను నింపుకొని తడబడుతున్న అడుగులతో మెల్లగా వెనుదిరిగిపోయాడు.

ooo

జనం భారీగా వచ్చారు. ఫంక్షన్ హాల్ నిండిపోయింది. అధికారులు, అనధికార్లు వేదిక మీదికి వచ్చి పద్మపాణి, పద్మముఖిల మంచి తనాన్ని గురించి పొగడ్తలతో ముంచేస్తున్నారు. కొడుకులు కూడా వాళ్లను పొగిడి వాళ్ల శేష జీవితాన్ని తమ మధ్య గడుపుకోవడం వాళ్ల గొప్ప గుణం అని చెప్పు కొచ్చారు. చివరగా భార్గవ వేదిక మీదికి ఎక్కుతుంటే చివరి వరుసలో కూర్చున్న కొంత మంది కరతాళ ధ్వనులతో ఆహ్వానం పలికారు. ఊహించని ఆ ఘట నకు అంతా ఆశ్చర్యపోతుండగా భార్గవ వేదిక మీదు న్న అధికారులందరికి ఆహ్వానితులకి కృతజ్ఞతలు చెప్పి తన ఉపన్యాసాన్ని కొనసాగించాడు.

'నేను ఒక అనాథను. దాదాపు పది సంవత్సరాల క్రితం మా అమ్మా నాన్న చనిపోతే ఎవరూ లేని నన్ను ఆదరించి తమ పిల్లలతో సమానంగా అన్ని సదుపాయాలు కల్పించి నన్నింతవాణ్ని చేసిన ఈ దంపతులిద్దరికి నేను ఏమిచ్చినా ఋణం తీర్చుకోలేను. వీళ్లు నా ఆరాధ్యదైవాలు. నేను అమెరికా వెళ్లి సంపాదనాపరుడ్నైనా ఏ నాడు వాళ్లు నా నుంచి ఏమి ఆశించలేదు. నా బాగోగులు తప్ప. ఇండియాకు రాగానే నేను వాళ్లింట్లో అడుగు పెట్టగానే వాళ్లు చూపిన ఆదరణ మరువలేనిది. గోరంత సహాయం చేసి కొండంత గొప్పుగా చెప్పుకొనే ఈ రోజుల్లో... ఈ మహానుభావులు కనీసం ఒక్కరికి కూడా నాకు చేసిన సహాయం గురించి చెప్పుకోకపోవడం వాళ్ల గొప్పతనం. దానికి ఇంత కన్నా మంచి నిదర్శనం మరొకటి లేదు. నన్ను వారు దత్తత తీసుకోకపోయినా, వారి దత్తపుత్రునిగా వారి గొప్పతనాన్ని మనసంతా నింపుకొని నేను ఆయనకు ఒక బహుమతి ఇవ్వాలనుకొంటున్నాను...' అని ఒక్క క్షణమాగి వెనక వైపు ఉన్న వాళ్లని రమ్మని చేయి ఊపాడు.

వెంటనే పది మంది యువకులు పరుగు పరుగున వేదిక మీదికి వచ్చారు. వాళ్ల చేతుల్లో కూడా ఏమి లేదు. వచ్చిన ఆహ్వానితులకు భార్గవ ఏం బహుమతి ఇస్తాడని ఆతృతతో ఎదురు చూస్తుంటే.. 'ఈ అమ్మానాన్నలకు నేనిచ్చే బహుమతి ఇదే...'అంటూ పది మంది వైపు చేయి చూపాడు. అతనేం చెప్తున్నాడో ఎవరికీ అర్థంకాలేదు.

'ఈ దంపతుల స్ఫూర్తిని తీసుకొని నేను సంపాదన పరుడ్నైన తరువాత ఈ పది మందిని దత్తత తీసుకొని వారి బాగోగులు చూసుకొంటున్నాను. వారి భారాన్ని మోయడం నాకు కష్టంగా ఉన్నా నా భార్య, పిల్లల సహకారంతో నేను ఈ భారాన్ని సునాయసంగా సంతోషంగా మోస్తున్నాను. దానికి కారణం ఈ దంపతులే. ఈ దత్తపుత్రులకు నిజమైన తల్లితండ్రులు వీరే. నా లాంటి దత్తపుత్రుని వల్ల తయారైన ఈ దత్తపుత్రులు సంపాదన పరులై మరి కొంతమందిని దత్తత తీసుకొంటూ ..... వాళ్లు సంపాదన పరులై మరి కొంతమందిని దత్తత తీసుకొంటూ...ఇది నిరంతరంగా కొనసాగి అనాథ పిల్లలు అనాథలైపోకుండా గొప్పవారు కావాలని, చిరస్థాయిగా ఈ దంపతుల పేర్లు నిలబడి పోవాలని మనస్ఫూర్తిగా కోరుకొంటూ ఈ బహుమతి వారికి అందచేస్తున్నాను....' అంటూ పది మంది పిల్లల్తో పాటు భార్గవ పద్మపాణి పద్మముఖి కాళ్లకు నమస్కారం చేశాడు. ఫంక్షన్ హాల్ కరతాళధ్వనులతో మారు మోగిపోయింది.

ooo

ఫంక్షన్ అయిపోయిన మరుసటి రోజు ...

పద్మపాణి కొడుకులు కూతురు తన గదిలోకి రావడంతో వాళ్లేమి మాట్లాడక ముందే పద్మపాణి తనే మాట్లాడటం మొదలు పెట్టాడు.

మీరేమి అడగాలని వచ్చారో నాకు తెలుసు. ఎందుకంటే మీరు ఇక్కడికి వచ్చినరోజు రాత్రే మీ మాటలు నేను విన్నాను".

ముగ్గురు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అంతలోనే తమాయించుకొన్న పెద్దకొడుకు ఏదో చెప్పబోతుంటే "నేనేమి వినదల్చుకోలేదురా పెద్దోడా. నేను మీ వెంట రాకూడదని మీ మాటలు విన్న రాత్రే నిర్ణయించుకొన్నా. ఒక వేళ మీ అమ్మ వస్తే పిల్చుకొనిపొండి. నాకేమి అభ్యంతరం లేదు. మీరు మాట్లాడిన మాటలు నేను మీ అమ్మకు చెప్పలేదు. చెప్పి మీమీద ఆమె పెట్టుకొన్న అభిమానాన్ని, ప్రేమను దూరం చేయడం ఇష్టం లేదు. మీరు డబ్బు కోసం ఎంతో ఆశపడ్తున్నారు కాబట్టి మీ ఆశ నిరాశ చేయకూడదని మా కొచ్చిన డబ్బులు మొత్తం, ఈ ఇళ్లు అమ్మేసి మరో చిన్న ఇల్లు తీసుకొని మిగతా మొత్తం కూడా మీకే ఇవ్వాలను కొన్నాం. అయితే భార్గవ మాటలు విన్నాక అది తప్పనిపించింది. ఒక్క భార్గవను నేను దగ్గరకు తీసి ప్రయోజకుడ్ని చేస్తే వాడు పదిమంది జీవితాల్లో వెలుగులు నింపే ప్రయత్నం చేస్తున్నాడు. నేనిచ్చే డబ్బు మీ సంపాదనతో పోలిస్తే పెద్దమొత్తం అయినా కాకపోయినా మీకు దాని అవసరం పెద్దగా లేదు. కాని ఈ మొత్తం కొంత మంది జీవితాల్లో వెలుగు నింపుతుంది. ఓ చిరుదీపం తను మాత్రమే వెలిగి కాలిపోతే ఉపయోగమేముంది కనీసం మరికొన్ని చిరు దివ్వెలను వెలిగించేందుకు కారణ మైతే...అవి మరికొన్ని దీపాలను వెలిగిస్తాయి...నా నిర్ణయం మీకు బాధ కలిగించొచ్చు. కానీ దీంట్లో మార్పేమి ఉండబోదు. ఈ వయస్సులో మాకు తోడెవరని మీరు బాధ పడాల్సిన పని లేదు. నేను మీ అమ్మకు తోడు. నాకు ఆమె తోడు. మా ఇద్దరికి నేను తీసుకు పోయే దత్తపుత్రులు తోడు."......

పద్మపాణి మాటలు వింటూనే కొడుకు కోడళ్లతో సహా కూతురు కూడా ముఖం మాడ్చుకొంటు వెళ్లిపోయారు బైటకి. కాని పక్కనే ఉన్న పద్మముఖి భర్త నిర్ణయాన్ని గౌరవిస్తున్నట్లు ఆప్యాయంగా అతని భుజాల మీద చెయ్యి వేసింది తోడు నేనున్నానన్నట్లు !

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలుకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢ నమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒక వైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:

snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

వెన్నెల వానలో తడిపే కవిత్వం

మానవ హృదయాన్ని, సమాజ గమనాన్ని అవగాహన చేసుకోకపోతే మంచి కవిత్వం రాదన్న వాస్తవాన్ని కవి భగ్వాన్ తన తాజా కవితల సంపుటి 'చంద్రవర్షం' ద్వారా నిరూపించారు. శాస్త్రీయ అవగాహన, సామాజిక నిబద్ధత, స్పష్టత ఉన్న కవి భగ్వాన్. ఆయన తొలి కవితా సంపుటి 'బల్లకట్టు' నుంచీ ఇప్పటి వరకూ అదే స్థాయిలో మంచి కవిత్వాన్ని అందిస్తున్నారు. 'చంద్రవర్షం' కవితా సంపుటిలో ఉన్న ముప్పయ్యారు కవితలూ వేటికవే చదివిస్తాయి. ఆలోచింపజేస్తాయి. మానవ సంబంధాలపై చర్చని రేకెత్తిస్తాయి. ఇందులో మొదటి కవిత 'మనిషి కోసమే' నుంచి చివరి కవిత 'ఎన్నెన్ని వర్షాల్లో అన్నన్ని హర్షాలు' వరకూ అన్ని కవితల్లో అంతర్లీనంగా ఉండేది 'మానవతా వీచిక'. అయితే ఈ సంపుటిలోని మూడో కవిత 'కరెంటు పోయిన రాత్రి' భావనా పరంగా బాగున్నట్లన్పించినా ఆసమయంలో ఉండే కష్టాలు సామాన్య మధ్య తరగతి ప్రజలకే అధికమన్న వాస్తవాన్ని కవి విస్మరించారన్పిస్తోంది. అన్ని కవితల్లోనూ లోతైన విశ్లేషణ కన్పిస్తోంది. కుటుంబ సంబంధాలు మానవ సంబంధాలలోని ప్రతి చిన్న అంశాన్ని కూడా తనదైన శైలిలో కవిత్వీకరించారు. కొన్ని కవితల్లో కవి తన పల్లెనీ, దానిని అల్లుకున్న ప్రకృతినీ ఎంతో రసాత్మకంగా వర్ణించారు. పట్టణ జీవనంలోని కృత్రిమత్వానికీ, గ్రామీణ జీవితంలోని సహజత్వానికీ ఉన్న మౌలికమైన తేడాను కనిపెట్టి పాఠకులకు కవిత్వం ద్వారా అందించడంలో భగ్వాన్ కృతకృత్యులయ్యారు. 'తోటకు వీడ్కోలు' కవితలో భూమికి దూరమైపోతున్న రైతు ఆవేదనని కవి వివరించిన తీరు ఎవరికైనా కళ్ళు చెమ్మగిల్లేలా చేస్తుంది. పర్యావరణం గురించి, పతనమైపోతున్న జీవన విలువల గురించి రాసిన కవితలు ఆలోచింపజేస్తాయి. కొంతమంది సాహితీ మిత్రులను అభినందిస్తూ రాసిన కవితలు కూడా ఈ సంపుటిలో చోటు సంపాదించుకున్నాయి. అవికూడా మంచి కవిత్వంతో సుసంపన్నంగా ఉండడం విశేషం. మొత్తమ్మీద ఈ పుస్తకంలో అన్ని కవితలూ చిక్కని కవిత్వంతో విలక్షణమైన అనుభూతిని అందిస్తాయి.

పుస్తకం పేరు : చంద్రవర్షం (కవితా సంపుటి)
కవి : భగ్వాన్,
పేజీలు : 112, **ధర:** రూ.80/-
ప్రతులకు : భగ్వాన్, ఎఫ్-9, శ్రీ హరిశ్చంద్ర ఎన్‌క్లేవ్, మండపాక పోస్టు తణుకు మండలం ప.గో. జిల్లా, పిన్- 534218, ఫోన్: 9393533336

- బెందాళం క్రిష్ణారావు

కొత్త పుస్తకాలు

సైన్స్... ప్రజల కోసం...

'కళ కళ కోసం కాదు... కళ ప్రజల కోసం' అన్నట్టుగానే.. 'సైన్స్ సైన్స్ కోసం కాదు... సైన్స్ ప్రజల కోసం' అంటున్నారు ప్రముఖ రచయిత, విశ్లేషకుడు డా॥ నాగసూరి వేణుగోపాల్. సైన్స్, టెక్నాలజీ రంగాలు ఎవరికోసం పని చేయాలి? ఎలా పనిచేయాలి? ఈ రంగాలతో మిగతా రంగాలకు ఏరకమైన సంబంధాలు వుండాలి. ప్రజలకవి ఎలా దోహదపడాలి వంటి అనేక ఆసక్తికర అంశాలపై నాగసూరి విశ్లేషణే ఈ 'ఆధునికతకు చిరునామా- సైన్స్' పుస్తకం. సైన్స్‌తో ముడిపడ్డ సామాజిక అంశాలపై విశ్లేషించిన 42 వ్యాసాలు ఈ సంపుటిలో వున్నాయి. సైన్స్‌లోని బహుముఖ పార్శ్వాలను స్పృశిస్తూ రాసిన ఈ వ్యాసాలు భిన్న ఆలోచనల సంఘర్షణకు దోహదం చేస్తాయి. టెక్నాలజీ పెరిగి, దాని వినియోగం పెరిగినా కూడా జీవన విధానంలో సైన్స్ దృష్టి, దానికి మూలమైన ఇంగితం ఎంతగానో తగ్గిపోతున్నది. దానికి అతి పెద్ద ఉదాహరణే రాకెట్ ప్రయోగానికి ముందూ తర్వాత కూడా పూజలు పునస్కారాలు నిర్వహించడం.

ప్రస్తుతం తెలుగులో సైన్స్ అధ్వానంగా వుందని, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ పెరిగిన తర్వాత వాణిజ్య కోణం లేని ఏ అంశమూ ప్రాధాన్యతను సంతరించుకోవడం లేదని పలు వ్యాసాల్లో రచయిత తన ఆవేదనను, ఒకింత ఆగ్రహాన్నీ వ్యక్తపరుస్తాడు. అంతే కాదు.. శ్రీశ్రీ లోని వైజ్ఞానికుడ్ని, సైన్స్ రామలక్ష్మణులుగా పేర్కొన్న ఒద్దిరాజు సోదరుల సైన్స్ దృక్పథాన్ని చక్కగా విశ్లేషించారు. సంగీతంలో సైన్స్ ప్రాధాన్యతను వివరిస్తూ... ప్రకృతిని అర్థం చేసుకోవడంతో మొదలై, అనుకరించడంలో వర్ధిల్లుతోందని అంటారు రచయిత. అలాగే... మతం ఒక గతం, ఒక అనర్థం, మత్తుమందు, విభేదాలకు కారణం, రాజకీయాలకు నెలవు, దోపిడీకి అవకాశం- అంటూ సైన్స్‌కూ, సమాజానికి వున్న లంకెను విపులీకరిస్తారు. మూఢనమ్మకాల ముసుగును తొలగించి వాస్తవాలను తెలియజెప్పే ప్రయత్నం చేస్తారు నాగసూరి. ప్రస్తుత సమాజానికి అక్షరాస్యతతో పాటు సైన్స్ అక్షరాస్యత కూడా అవసరమని, సైన్స్ జర్నలిజం వృద్ధి చెందాలని నీలి మేఘానికి వెలుగు చారికల్లా కనబడే సైన్స్ ప్రయోగాలను ఆహ్వానించాలని రచయిత కోరుకుంటాడు. చిన్నా పెద్దా తేడా లేకుండా ఆలోచన చేయగలవారందరూ చదవాల్సిన పుస్తకం ఇది. సైన్స్, సాంకేతిక విజ్ఞానం తెలుగులో చాలా తక్కువగా లభ్యమౌతోంది. అందుకే... శాస్త్రవిజ్ఞానం స్థానిక భాషల్లోనే అభివృద్ధి చెందాలని ఎందరో ప్రముఖులు చెబుతున్నారు. తెలుగువారు గర్వించదగ్గ విజ్ఞాన శాస్త్రవేత్తలు గతంలోనూ వున్నారు. ఈ ఆధునిక యుగంలోనూ వున్నారు. అయితే.. ఆ శాస్త్ర విజ్ఞానం ప్రజలకు వారి మాతృ భాషలోనే అందుబాటులోకి రావాలి. అలాంటి ఉద్దేశంతోనే ఈ రచన యావత్తూ కొనసాగినట్టు... ఈ పుస్తకంలోని వ్యాసాలను చదివితే మనకు అర్థమవుతుంది. అందుకే ఇది అందరూ చదవాల్సిన పుస్తకం.



పుస్తకం పేరు : ఆధునికతకు చిరునామా సైన్స్
రచయిత : డాక్టర్. నాగసూరి వేణుగోపాల్
పేజీలు :133
వెల :100/-
ప్రతులకు : నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్ జిఎస్ఐ పోస్ట్, బండ్లగూడ, నాగోలు, హైద్రాబాద్-500068
ఫోన్ : 24224453/54

- రాజాబాబు కంచర్ల

వినూత్నం

లక్ష్మణ్ యాదవ్

బాలల పంచాయతీ

కక్ని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నాడు లక్ష్మణ్ యాదవ్. ఓ రోజు పాఠశాలలో ఉపాధ్యాయుడు కొట్టిన దెబ్బలకి తన నుదురు భాగం నెత్తురోడింది. మధ్యాహ్న భోజనంలో సరిగా ఉడకని గుడ్డుని మార్చమని అడిగినందుకు పర్యవసానం అది. అందుకా చిన్నారి ఏ మాత్రం కుంగిపోలేదు. ఎందుకంటే తనకి తన హక్కులపై అవగాహన వుంది. తల్లితో కలిసి పదిహేను కిలో మీటర్లు నడుచుకుంటూ తేసరి ప్రాంతంలోని బి.బి.ఎ (బచ్‌పన్ బచావో ఆందోళన్) జిల్లా కార్యాలయ అధికారికి ఫిర్యాదు చేసేలా చేసింది. ఇంతకీ ఇలాంటి చిన్నారుల్లో ఇంతటి చైతన్యం ఎలా వచ్చిందో తెలుసుకుందాం.

గ్రామాల్లో ఏవైనా సమస్యలు వస్తే అవి గ్రామ పంచాయతీల్లో పరిష్కారమవుతాయి. మరి తమ హక్కులని అందుకోలేని చిన్నారులు వారి బాధల్ని ఎవరికి చెప్పుకోవాలి. వివక్ష, వెట్టిచాకిరి, బానిసత్వ సమస్యలని ఎలా పరిష్కరించుకోవాలి? అందుకోసం ఏర్పాటు చేసినవే బాల పంచాయతీలు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి చేపట్టిన బచ్‌పన్ బచావో ఆందోళన (బి.బి.ఎ)లో భాగంగా రూపుదిద్దుకున్నదే ఈ బాలల పంచాయతీలు. పిల్లలకు తమ హక్కులను తెలియచేయడమే కాక గ్రామాభివృద్ధికి సైతం తోడ్పడుతున్నాయి. ఆ చైతన్యంతోనే లక్ష్మణ్ ధైర్యంగా బ్లాక్ డిస్ట్రిక్ట్ అధికారి (బి.డి.ఒ)ని కలిసి తన బాధ చెప్పాడు. బి.డి.ఒ ఆదేశానుసారం ఆ ఉపాధ్యాయుడిని కొంత కాలం ఉద్యోగ బాధ్యతల నుంచి సస్పెండ్ చేశారు. గ్రామీణ బాలలు ఎదుర్కొంటున్న ఇలాంటి సమస్యలెన్నిటికో పరిష్కార మార్గాన్ని చూపిస్తోంది బాల్ పంచాయత్. పంచాయతీ స్థాయిలో ఎన్నికల ద్వారా ఎన్నుకోబడ్డ పిల్లలే దీన్ని నిర్వహిస్తారు. అక్కడ అర్జీకి వచ్చిన పిల్లల సమస్యలు పరిష్కరించడమే కాదు, గ్రామంలోని ప్రతి చిన్నారికి తమ హక్కులని తెలిసేలా చేస్తారు.

ఈ బి.ఎమ్.జి ప్రోగామ్‌ని అమలు పరిచేందుకు 2015 డిసెంబర్‌లో ఎన్నుకోబడింది కాక్ని గ్రామం. రాజస్థాన్‌లోని జార్ఖండ్ నుండి 250 కిలోమీటర్ల దూరంలో ఓ మారుమూల కొండ ప్రాంతంగా వుంటుంది గిరిధి. ఆ పల్లెల్లో కక్ని ఒకటి. అక్కడ నివసించే 250 కుటుంబాల్లో కొందరు వ్యవసాయ కూలీలుగా, భవన నిర్మాణ కార్మికులుగా వుంటే మరికొందరు అభ్రకం (మైకా) తవ్వకాల్లో పని చేస్తున్నారు. అత్యంత ప్రమాదకరమైన ఈ పనుల్లో పెద్దలే కాదు చిన్నారులూ ఏళ్ల తరబడి బాల కార్మికులుగా మగ్గుతున్నారు. గతంలో అభ్రకం కోసం జరిగే తవ్వకాల్లో పడి ఎంతో మంది పిల్లలు చనిపోయిన దాఖలాలు వున్నాయి. మరో ఉపాధి మార్గం లేకపోవడంతో చిన్నారులు సైతం ప్రాణాలను పణంగా పెట్టి ఇక్కడ పని చేస్తుంటారు. అనారోగ్యం పాలైతే గతుకు దారుల్లో 15 కి.మీ ప్రయాణించి పక్క గ్రామంలో వున్న ప్రభుత్వాసుపత్రికి చేరుకోవాల్సి వుంటుంది. కనీస సదుపాయాలు లేక దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్న ఇలాంటి ఎన్నో గ్రామాల్లో చట్టాలపై అవగాహన వున్నవారు తక్కువే. ఇక బాలల హక్కుల గురించి అక్కడ ఎలాంటి ప్రస్తావనా వుండదు. అలాంటి ప్రాంతాల్లో బాల్



పంచాయత్‌లు క్రియాశీలకంగా పనిచేయడానికి తోడ్పడింది బి.బి.ఎ. వీటినే అక్కడ పిల్లల అసెంబ్లీగా పిలుస్తారు. గ్రామ పంచాయతీల చేత గుర్తింపు పొందిన ఈ పిల్లల పంచాయతీలు కూడా వాటి తరహాలోనే పని చేస్తాయి. ఏడాదికోసారి ఎన్నికలను నిర్వహించి పదకొండు మంది పిల్లల్ని సభ్యులుగా తమ గ్రామంలోని చిన్నారులే ఎన్నుకుంటారు. బాలల హక్కులు, సామాజిక సమస్యలపై వారిచ్చే ప్రసంగాలపైనే అభ్యర్థుల ఎంపిక ఆధారపడి ఉంటుంది. ఇలా బాలల చేత ఎన్నుకోబడ్డ ఈ పంచాయతీ పెద్ద కూడా ఆ పదకొండు మందిలో ఒక్కరే కావడం విశేషం. అతన్ని ముఖియా అని పిలుస్తారు. తనతో పాటు ఉప పెద్ద కూడా ఎన్నుకోబడతాడు. మిగిలిన వారు క్రీడా, విద్య, ఆరోగ్య, పారిశుధ్య మంత్రులుగా వుంటారు. బి.బి.ఎ సభ్యుల ద్వారా ఇక్కడ మొదటగా బాలల హక్కులని తెలపడంతోపాటు సమస్యలని పరిష్కరించుకునే మార్గాలపై అవగాహన కల్పించారు. ఇక నెలకోసారి బి.ఎమ్.జి నిర్వహించే సదస్సులు, అవగాహనా కార్యక్రమాల ద్వారా పిల్లల సమస్యలని తెలుసుకుంటారు. కాక్ని ప్రాంతంలో అభ్రకం తవ్వకాల్లో పనిచేస్తున్న పదిమంది బాల కార్మికులకి విముక్తి కల్పించింది బి.బి.ఎ. మద్యపాన నిషేధం, బాల్య వివాహాలని అదుపు చేయడం, బాలికా విద్య తదితర అంశాలపై చిన్నారి సభ్యులిచ్చే ప్రసంగాలు గ్రామ పరిస్థితుల్లో మార్పుకి దోహద పడుతున్నాయి. తమ హక్కులని తెలుసుకున్న చిన్నారులు అధికారులని సైతం ధైర్యంగా ప్రశ్నించగలుగుతున్నారు. మన దేశంలోని పన్నెండు రాష్ట్రాల్లో ఏర్పడ్డ 503 బిఎమ్‌జి (బాల్ మిత్ర గ్రామ్)ల ఆలోచన ఇప్పుడు పక్క దేశాలైన నేపాల్, భూటాన్‌లలో కూడా అమలయ్యింది. హక్కుల కోసం ప్రశ్నించే పిల్లల్ని బెత్తంతో హింసించే ఉపాధ్యాయులే కాదు బడికి గైర్హాజరవుతూ వారి భవిష్యత్తుకి ఆటంకంగా మారిన అనేక మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు సక్రమంగా బడికొచ్చేందుకు బి.ఎమ్.జి దోహదపడుతోంది.

- శర్వాణి

బీరకాయ రొయ్యల కూర

కావాల్సిన పదార్థాలు

బీరకాయలు-2
రొయ్యలు-400 గ్రాములు (శుభ్రం చేసినవి)
నూనె-2 టీ స్పూన్లు
ఉల్లిపాయలు-2
పచ్చిమిర్చి-4
కరివేపాకు-4రెబ్బలు
అల్లం వెల్లుల్లి పేస్టు-1 టేబుల్ స్పూను
కారం-ఒకటిన్నర టీ స్పూను
గరం మసాల పొడి-అర టీ స్పూను
ఉప్పు-తగినంత
కొత్తిమీర తరుగు-గుప్పెడు
దనియా, జీర, పసుపు పొడులు-అర టీ స్పూను చొప్పున

తయారీ విధానం

ముందుగా రొయ్యల్లో 1 టీ స్పూను కారం, పావు టీ స్పూను ఉప్పు, దనియా, జీర, పసుపు పొడులు వేసి బాగా కలపాలి. తర్వాత కొద్దిగా నూనెలో నీరంతా ఆవిరయ్యేవరకు చిన్నమంటపై వేయించి పెట్టుకోవాలి. అదే బాణలిలో మరికొంత నూనె వేసి ఉల్లి, పచ్చిమిర్చి తరుగు, కరివేపాకు, అల్లం వెల్లుల్లి పేస్టు ఒకదాని తర్వాత ఒకటి వేయించాలి. తర్వాత అందులోనే బీర ముక్కలు(తొక్క తీసిన), ఉప్పు కలిపి మగ్గనివ్వాలి.

ముక్కలు సగం ఉడికిన తర్వాత రొయ్యలతో పాటు పావు కప్పు నీరు పోసి ఉడికించాలి. కూర చిక్కబడ్డాక కొత్తిమీర చల్లి దించేయాలి. దానిని వేడి వేడి అన్నంలో కలుపుకుని తింటే ఎంతో రుచిగా ఉంటుంది.

చింతకాయ రొయ్యలు

కావాల్సిన పదార్థాలు

రొయ్యలు-అర కిలో
చింతకాయ ముక్కలు-100గ్రాములు
ఉల్లిపాయ ముక్కలు-అర కప్పు
అల్లం వెల్లుల్లి పేస్ట్-1టీ స్పూను
గరం మసాలా-1టీ స్పూను
కారం-2 టీ స్పూనులు
కరివేపాకు-2 రెబ్బలు
పసుపు-అర టీ స్పూను
ఉప్పు-తగినంత
నూనె-సరిపడా

తయారీ విధానం

ముందుగా రొయ్యల్ని శుభ్రంగా కడిగి పెట్టుకోవాలి. తర్వాత లేత చింతకాయ ముక్కల్ని రోట్లో దంచుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు బాణలిలో నూనె వేడి చేసి అందులో ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్ట్, కరివేపాకు వేసి ఎర్రగా వేయించాలి. అందులోనే ఉప్పు, కారం, పసుపు 'రొయ్యల్ని' కూడా వేసి కలపాలి. దానిని పది నిముషాలు సన్నని మంటపై మగ్గనివ్వాలి. తర్వాత దానిలో దంచి పెట్టుకున్న చింతకాయ ముద్దను కూడా వేసి బాగా కలపాలి. తర్వాత దానిలో గరం మసాలా వేసి ఐదు నిమిషాలు ఉడికించి దించేయాలి. దీన్ని కొత్తిమీర తురుముతో అలంకరిస్తే చింతకాయ రొయ్యల కూర రెడీ.

వంకాయ రొయ్యల కూర



కావాల్సిన పదార్థాలు

వంకాయలు-4
రొయ్యలు-1కప్పు
పచ్చి మిర్చి-1
ఉల్లిపాయ-1
అల్లం వెల్లుల్లి పేస్టు-1టీ స్పూను
టమోటా-1
ఉప్పు-తగినంత
పసుపు-పావు టీ స్పూను
కారం-1 టీ స్పూను
నూనె-2 టేబుల్ స్పూన్లు
కొత్తిమీర తరుగు-పావు కప్పు

తయారీ విధానం

ముందుగా బాణలిలో వేడి చేసిన నూనెలో ఉల్లి, పచ్చిమిర్చి తరుగుతో పాటు అల్లం వెల్లుల్లి పేస్టును దోరగా వేయించాలి. తర్వాత అందులో వంకాయ ముక్కలు, ఉప్పు, పసుపు, కారం వేసి మూత పెట్టి చిన్నమంటపై మగ్గించాలి. తర్వాత అందులోనే రొయ్యలు కలిపి మంట కొద్దిగా పెంచాలి. రొయ్యలు వేగాక కొత్తిమీర చల్లి గ్యాస్ ఆపేయాలి. 5 నిమిషాల తర్వాత సర్వ్ చేస్తే సరి.

లెక్కించండి



ఇక్కడ రేఖాగణితానికి సంబంధించిన కొన్ని ఆకారాలని వుంచాం. మీరు చేయాల్సిందేంటంటే ఒక్కో వరుసలో చివర ఇచ్చిన ఆకారాలు ఆ వరుసలో ఎన్నున్నాయో లెక్కించి అక్కడ రాసేస్తే సరిపోతుంది.

నేర్చుకుందాం

పిల్లలూ! మీకు బొమ్మలు గీయడమంటే ఎంతో ఇష్టం కదూ! మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ ముందుగా కుందేలు బొమ్మని గీసుంచారు. మీరూ జాగ్రత్తగా ప్రయత్నించండి.



ఏ నీడ ఎవరిది

పిల్లలూ! ఇక్కడ కొన్ని పక్షులు వాటి నీడలని వుంచాం. ఏ పక్షి నీడ ఎక్కడుందో గుర్తించి వాటిని జతచేయండి.



లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్
నేనో టాలీవుడ్
స్టార్‌ని! ఇది నా
చిన్ననాటి ఫోటో
ఇంతకీ నేనెవరో
చెప్పండి?

జ: శివ బాలాజి



చుక్కలు కలుపుదాం



ఆకుతో బొమ్మ



మనింటి ముందు రాలిపడుతుండే పచ్చి, ఎండుటాకులతో చేప బొమ్మ ఏలా చేయొచ్చో ఇక్కడ ఇచ్చాం! వాటిని గమనించి మీరూ తయారుచేసేయండి!

దారి కనుక్కోండి

మీకు టామ్ అండ్ జెర్రీ బాగా తెలుసు కదా! ఇక్కడున్న టామ్‌ని వెతుక్కుంటూ జెర్రీ బయల్దేరింది. అయితే గజిబిజాగా వున్న దారిలో దానికి ఎలావెళ్లాలో తెలియడం లేదు. మీరే దారిని కనిపెట్టండి





బ్రేక్ వేసి కాపాడాడు

పిల్లలూ! మీ స్కూల్లో నిర్వహించే పిక్నిక్, ఎడ్యుకేషనల్ టూర్‌లకి మీరూ వెళ్తుంటారు కదా. అప్పుడు అమ్మానాన్నలు, టీచర్లు బోలెడన్ని జాగ్రత్తలు చెప్తుంటారు. వాటిని పాటిస్తూ ఎలాంటి ప్రమాదాల్లో చిక్కుకోకుండా క్షేమంగా ఇల్లు చేరుతుంటారు. అలాగే ప్రఫుల్ శర్మ కూడా ఒక సారి స్కూల్ ఎడ్యుకేషనల్ టూర్‌కి వెళ్లాడు. అప్పుడక్కడ ఒక ప్రమాదం చోటు చేసుకుంది. అయితే సమయస్ఫూర్తితో తోటి విద్యార్థుల ప్రాణాలను కాపాడాడు ప్రఫుల్. అదేంటో చూద్దాం.

హిమాచల్ ప్రదేశ్‌లోని మండి ప్రాంతంలో 2015లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు ప్రఫుల్. తను చదువుతున్న లార్డ్ కాన్వెంట్ పాఠశాల యాజమాన్యం ఎడ్యుకేషనల్ టూర్‌ని నిర్వహించింది. స్కూల్ బస్‌లో తోటి విద్యార్థులతో ప్రఫుల్ కూడా బయల్దేరాడు. టూర్ పూర్తవగానే విద్యార్థులతో బస్సు బయల్దేరింది. మార్గ మధ్యలో విరామం కోసం ధర్మపురి వద్ద బస్సు ఆపి డ్రైవర్ కిందికి దిగాడు. అది కొండ ప్రాంతం కావడంతో ఊహించని విధంగా బస్సు కదిలి వేగంగా ముందుకు పరుగు తీసింది. ఇంతలో బస్సులోని పిల్లలందరూ భయంతో కేకలు పెట్టడం ప్రారంభించారు. డ్రైవర్ గమనించేలోపే బస్సు కొండ చరియల వద్దకి చేరుకుంది. ప్రఫుల్ మాత్రం ధైర్యం కోల్పోకుండా ఒక్క పరుగులో డ్రైవర్ సీటుకు చేరుకుని బ్రేక్‌ని ఉపయోగించి బస్సుని ఆదుపు చేశాడు. బస్సులో తనతో ప్రయాణిస్తున్న 15 మంది విద్యార్థులని సమయస్ఫూర్తితో కాపాడినందుకు ప్రభుత్వం సుమిత్‌కి జాతీయ సాహస బాలల పురస్కారాన్ని అందించింది. ప్రఫుల్ సాహసానికి హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం సైతం లక్ష రూపాయల బహుమానాన్ని ప్రకటించింది.

పదవికాసం – 53

కూర్పు: రావెళ్ల

ఆధారాలు

అడ్డం

1. సమీపం (4)
3. ఉదయం తినే మితాహారం (4)
7. హద్దు (2)
8. ధ్వని (3)
10. తుది లేని వెదుకులాట (2)
11. 'సందు, మినుము'లోని మెదటి అక్షరాలు (2)
12. అడవి (2)
14. తాజ్‌మహల్ ఉన్న చోటు (2)
15. అటు నుండి సమాచారం (2)
17. మొండి (2)
19. చివర లేని ఎద్దడి (2)
21. చంపడం (2)
22. నీరాజనం (3)
24. సారం (2)
27. ముక్కుతో మాట్లాడే మాట(4)
28. కాలాన్ని గురించి ఎరిగినవాడు (4)

1		2		■	3	4		5
	■		■	6	■		■	
7		■	8		9	■	10	
	■	11		■	12	13	■	
■	14		■	■	■	15		■
16	■	17	18	■	19		■	20
21		■	22	23		■	24	
	■	25	■		■	26	■	
27				■	28			

నిలువు

1. హద్దు(4)
2. చప్పుడు (2)
4. సిగ్గు (2)
5. తప్పులు వెదికేవాడు (4)
6. దారి (2)
8. దాదాపుగా లో సగమే (2)
9. తిరగబడ్డ పార్వతి (2)
11. యుద్ధము (3)
13. నర్తించునది (3)
16. చుట్టు తిరగడం (4)
18. కుటుంబ నియంత్రణ క్లుప్తంగా (2)
19. పుస్తె(2)
20. అవధానాలు చేసేవాడు (4)
23. పొందికయిన (2)
25. ఢిల్లీ లోని ప్రసిద్ధిగాంచిన మసీదు (2)
26. కోణము (2)

సుడోకు

గతవారం జవాబులు

6	4	7	2	3	9	8	5	1
8	9	5	4	1	6	2	3	7
1	2	3	5	7	8	9	4	6
4	3	8	6	2	5	1	7	9
7	5	6	8	9	1	3	2	4
2	1	9	3	4	7	6	8	5
9	8	2	1	5	4	7	6	3
3	7	4	9	6	2	5	1	8
5	6	1	7	8	3	4	9	2

8				3	5			
	6	3		9	8		1	
		1				8		
2	1			5			6	
		8		7	4			
4	5			1			3	
			5					
7	3				1	2	8	
1	2		7				9	

■	1 తు	2 ద	కు	■	3 ర	4 గ	డ	■
5 మె	■	రి	■	6 ల	■	త్రీ	■	■
7 డ	బ్బా	■	8 వి	వ	ర్ణం	■	9 మ	10 ర
కా	■	11 పా	■	ణం	■	12 క	■	క్ష
13 క	చ్చ	ప	ట్టు	■	14 పా	లి	కే	క
డో	■	డు	■	15 రు	■	మి	■	భ
16 లు	పా	■	17 అ	ధి	కం	■	18 చే	టు
■	■	19 తా	■	రం	■	20 ర్పు	■	డు
■	21 న	ట	న	■	22 జా	తీ	యం	■

వన్య వంతెనలు



పీతల వంతెన, క్రిస్మస్ దీవి

తాళ్ల వంతెన, విక్టోరియా





ఎలుగుబంట్ల వంతెన, కెనడా



ఏనుగుల అండర్‌పాస్, కెన్యా



తాబేళ్ల సొరంగం, జపాన్





మంచు సొరంగం, ఫిన్‌ల్యాండ్

వన్యప్రాణుల పైవంతెన, బెల్జియం

పచ్చ వంతెన, జర్మనీ

బతుకు బండి లాగించేందుకు సుదూరాలకు రహదారులు వేసేసుకున్నాం. రైలు బండిని పట్టాలపై పరుగులు తీయిస్తున్నాం. కొండలడ్డొస్తే సొరంగాలు తవ్వేశాం, నదులు దారినపడితే వంతెనల్ని కట్టేశాం. ఇలానే మిగతా ప్రాణుల ప్రవాసానికి కూడా అడ్డుపడుతున్నాం. వాటి మనుగడను ఇబ్బంది పెడుతున్నాం. ప్రపంచంలోని ఎన్నో ప్రధాన రహదారులు, రైలు మార్గాలు, వంతెనలు ఇవన్నీ కూడా వన్యప్రాణుల నెలవుల మధ్య నుంచి వెళ్లడం, వాటి వలస మార్గాల్ని చీల్చేయడంతో వాటి 'గ్రేట్ మైగ్రేషన్'కు ఆటంకాలు ఎదురవుతున్నాయని తేలింది. మీరెపుడైనా చూసుంటారేమో వందల సంఖ్యలో రోడ్డుకు అడ్డంగా పడి జీవాలు వెళుతున్న దృశ్యాలు. ఇక రోడ్‌కిల్ లిస్ట్‌లో చిన్న కప్పల నుంచి పెద్ద పెద్ద ఎలుగుబంట్లు, ఏనుగులే ఉంటాయి. ప్రమాదాల్లో ఇటు మనుషుల ప్రాణాలకూ ముప్పు కలుగుతుంటుంది. అందుకే ఓ ఆలోచన చేశారు. వేసవి, చలి కాలాల్లో జంతు వలసలెక్కువగా ఉంటాయని గుర్తించి ఆయా సమయాల్లో ట్రాఫిక్ క్లోజ్ చేయడం, స్పీడ్ లిమిట్‌ను బాగా కుదించేయడం వంటి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంటారు. బెల్జియం, జపాన్, జర్మనీ, కెనడా ఇలా చాలా దేశాల్లో ఈ కొత్త ఆలోచనతో జీవజాలం బండి సజావుగా సాగిపోతోంది. వీటిని ఎకోడక్ట్‌లంటున్నారు. 1950ల్లో ఫ్రాన్స్‌లో ఈ తరహా తొలి నిర్మాణం జరిగింది. ఇక ప్రపంచంలోనే అత్యంత పొడవాటి వంతెన నెదర్‌ల్యాండ్స్‌లోని నాచుర్‌బ్రుగ్ జాండెరీజ్ క్రైయాలూ. ఆ వన్య వంతెనల తీరుతెన్నులు మీరూ చూడండి.

బూరల ఊరు..!







కప్పాడోసియాను 'ఎయిర్ బెలూన్ల ఊరు' అని పిలవొచ్చు. అక్కడికెళ్లామని ఎవరన్నా అంటే హాట్ ఎయిర్ బెలూన్‌లో యాత్ర ఎలా ఉందని అడుగుతారు. అంత అటాచ్ అయ్యి ఉంటాయి రెండూ. ఒకటి కాదు రెండు కాదు పదుల కొద్దీ ఒక్కోసారి వందల కొద్దీ బెలూన్లు పర్యాటకుల్ని ఎక్కించుకుని గాలిలోకి లేస్తాయి. చూడ్డానికి ఇదేదో చిన్నపిల్లలు బూరల తాడు వదిలేశారేమో అనిపిస్తుంది. టర్కీలోని అగ్నిపర్వత ప్రాంతంలో కప్పాడోసియాలో మూడు వేల్ల ఏళ్ల నాటి అంతర్గత నగరముంది. ఇక్కడ గుహాలయాలెన్నో కనిపిస్తాయి. లావా ఎగజిమ్మడం వల్ల కొండంత ఎత్తు స్థంభాల్లా రాళ్లుంటాయి. మంచు కరిగి నీటి ప్రవాహం వల్ల కోసుకుపోయిన భూమి విచిత్రమైన రూపాల్లో ఉంటుంది. విభిన్న ఆకృతుల్లో ఉండే నేల, గుట్టల తీరు తెన్నులు అద్భుతంగా తోస్తాయి. ఇక హాట్ ఎయిర్ బెలూన్‌లో ఎత్తుకు చేరుకుంటూ చూస్తే మరింత ఆశ్చర్యంగా కనిపిస్తాయి. ఈ కోణంలో కప్పాడోసియా చూపాలనే ఏడాదంతా బెలూన్ యాత్రలు ఉంటాయి. అప్పుడప్పుడూ అంతర్జాతీయ హాట్ ఎయిర్ బెలూన్ ప్రదర్శనలుంటాయి.

Check List

Book Number	KNSR02B159	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mouni	Cutting By	Mouni
Scanned By	prathyu	Pages	29